MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి :19 సంచిక: 8 రంగారెడ్డి ఏప్రిల్ 2021 పేజీలు : 36 వెల : రూ. 10/-

## మహిళా దినోత్సవ సత్కారం ... పురస్కారం !




తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో శ్రీ సి ఎస్ రెడ్డికి సత్కారం



జి ఎం ఎం , ధీశాలి నేతలు విజయలక్ష్మికి, మంజులకు నాబార్డ్ సిజిఎం శ్రీ వై కృష్ణారావుచే బహుమతులు



అరబిందో - ఏపిమాస్ సంయుక్త నిర్వహణలోని పీలేరు ఎఫ్ పి ఓ సభ్య రైతులకు కోడి పిల్లలను, ట్రాక్టర్లను పంపిణీచేసిన అరబిందో ఫార్మా వైస్‌చైర్మన్ , మేనేజింగ్ ట్రస్టీ శ్రీ కె. నిత్యానంద రెడ్డి.. పక్కనే ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి



రెడ్స్ సంస్థకు 'స్టార్ విమన్ గ్రూప్' అవార్డు ప్రదాన సభలో ప్రసంగిస్తున్న అనంతపురం జిల్లా కలెక్టర్ శ్రీ గంధం చంద్రుడు






ఆదిలాబాద్ డి ఎం సి సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి సిక్తా పట్నాయక్‌తో ఏపిమాస్ ప్రతినిధులు



అసిఫాబాద్ డి ఎం సి సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీ రాహుల్ రాజ్ తో ఏపిమాస్ ప్రతినిధులు

NABARD

నాబార్డ్ సౌజన్యంతో



नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
బహిరంగంగా బహిర్భూమికి వెళ్ళడం సరికాదు
మీ ఇంటి లోపల మరుగుదొడ్డి నిర్మాణం మంచి పరిష్కారం
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

# మహిళా సాధికారత

సంపుటి 19 సంచిక 8




సంపాదకీయం

## బహుపరాక్!

**కథ** మళ్ళీ మొదటికొస్తున్నది. క్రిందటి సంవత్సరం ఈ సమయానికి ఎంతటి కష్టనష్టాలపాలైనామో తిరిగి అంతగా మనలను అన్ని విధాల యిరుకున పెట్టడానికి, వేధించడానికి, మన ఉసురు తీయడానికి ఆ మహమ్మారి మళ్ళీ విజృంభిస్తున్నది. ఆదమరిస్తే అంతే సంగతులు! ఐతే, క్రిందటి ఏడాది మనకు దాని ఆనుపానులేవీ తెలియకముందు, ఒక్కసారిగా ప్రళయంలా అది విరుచుకుపడినప్పుడు ఏ ధైర్యంతో, ఎంత నిబ్బరంతో, ఎంతటి పూనికతో దానిని ఎదుర్కొన్నామో, ఆ కోవిడ్–19 మహమ్మారిని యిప్పుడుకూడా తగిన జాగ్రత్తలతో, అనుభవం నేర్పిన అవగాహనతో అంతకంటే సులువుగా ఎదుర్కోవచ్చు. మన ముందుజాగ్రత్తే మనకు రక్షా కవచం! గత అనుభవ పాఠాలు మన ముందున్నాయి కాబట్టి యిప్పుడు దానిని మరింత సన్నద్ధతతో అణచివేయవచ్చు. ఇటు వ్యక్తిగతంగా, కుటుంబపరంగానే కాకుండా సమాజపరంగా, ఉపాధిపరంగా కూడా మనం తగిన జాగ్రత్తలను పాటించడం అవసరం. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించడం, తప్పనిసరిఅయిన మేరకు మాత్రమే బయట తిరగడం, గుంపులుగా దగ్గరదగ్గర గుమికూడకుండా తగినంత దూరంగా మెలగడం, శుభ్రతను, ఇతర ఆరోగ్య సూత్రాలను పాటించడం మరువకూడదు. నిజానికి అవి ఎప్పుడూ అనుసరించదగినవే. కోవిడ్ నిరోధక టీకా కూడా అందుబాటులోకి రావడం, ప్రభుత్వాలు అర్హులైనవారందరికీ ఉచితంగా ఆ టీకా వేస్తుండడంతో యిప్పుడు ఆ కరోనా కథ కట్టించడం అంత కష్టమేమీ కాదు. 45 ఏళ్ళకు పైబడినవారందరికీ టీకా యిస్తున్నందున ఆ వయసు వారందరూ వెంటనే టీకా వేయించుకోవడం అత్యవసరం. అనవసరమైన భయాందోళనలతో టీకా వేయించుకోకపోతే కోరి ముప్పును ఆహ్వానించినట్టే!

ఇక ఆదాయం నష్టపోకుండా ఉపాధిపరంగా ఎలాంటి జాగ్రత్తలు వహించాలనేది అందరం ఆలోచించవలసిన విషయం. ఇక్కడ కూడా మనకు గత అనుభవ పాఠాలు ఎంతైనా ఉపయోగపడతాయి. క్రిందటి సంవత్సరం మొదటిసారిగా కరోనా మహమ్మారి విలయం సృష్టించిన సమయంలో కూడా తన కార్యక్షేత్రాలలో రైతులను, ముఖ్యంగా టమాటా, ఇతర ఉద్యాన రైతులను కూడగట్టి, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్ పి ఓలు, ఎఫ్ పి సి లను) ఉత్తేజపరచి, కార్పొరేట్ కొనుగోలు సంస్థలతో, ప్రాసెసింగ్ యూనిట్లతో అనుసంధానంచేసి పంట పాడైపోకుండా, రైతులు నష్టపోకుండా తగినధర లభించేలా చేసిన చరిత్ర ఏపిమాస్‌కు ఉన్నది. రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు బాసటగా నిలచి, మార్గదర్శనం చేసి, రెండు మూడు నెలలలోనే రికార్డ్ స్థాయిలో టమాటాల క్రయవిక్రయాలు జరిపించి దాతృత్వ, భాగస్వామ్య సంస్థలు, దేశ, విదేశాల ప్రభుత్వాలతో సహా పలువురి ప్రశంసలను, గుర్తింపును, పురస్కారాలను ఏపిమాస్ పొందగలిగింది. అనంతరం ఈ సంవత్సర కాలంలో ఎఫ్ పి ఓలు, ఎఫ్ పి సి లకు మరింత ప్రేరణ కలిగించి మరిన్ని ఉద్యాన పంటల నాణ్యమైన సాగుపై తగిన అవగాహన పొందేలా, మెరుగైన మార్కెట్ అనుసంధానాలు ఏర్పడేలా చూసింది. ఇంతే కాకుండా ఎస్ హెచ్ జి ల, వాటి ఫెడరేషన్ల సభ్యులను చైతన్యపరచి లాక్‌డౌన్ కష్టకాలంలో బతుకుతెరువు పోయి, తిండీతిప్పలు లేక నానా అగచాట్లు పడుతున్న వలసకూలీలను, నిరుపేదలను ఆదుకోవడానికి, వారి తోడ్పాటుతో ఉచితంగా ఆహార పదార్థాల పంపిణీ, మందుల పంపిణీ, మాస్కుల తయారీ మొదలైన సహాయ చర్యలను చేపట్టింది. ఇక ఇప్పుడు కూడా రైతు సంస్థలు, ఎస్ హెచ్ జి లు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మరింత అవగాహనతో, మరింత వివేచనతో, మరింత చైతన్యంతో వ్యవహరించి సభ్య రైతులకు, ఇతరులకు సేవలు అందించడంలో, వారి సంక్షేమాభివృద్ధికి తగిన వినూత్న కార్యక్రమాలను చేపట్టడంలో ఆరోగ్యకరమైన పోటీతత్వంతో పని చేయాలి. వారు పొందిన శిక్షణ, విజ్ఞాన పర్యటనలలో వారు చూసిన విశేషాలు, నేర్చుకున్న విషయాల సదవగాహనతో ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా మరింత మెరుగైన కార్యాచరణతో, కార్యక్రమాలతో ముందడుగు వేయగలగాలి. దాహం వేసినప్పుడు బావి తవ్వించాలనుకోవడం కాకుండా రాబోయే ముప్పును ముందుగానే ఊహించి సన్నద్ధంగా వుండగలగాలి. మనం ఇప్పుడు ముప్పు ముంగిట్లోనే వున్నామనే విషయం మరువకూడదు సుమా! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతి కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని ప్రయోజనం పొందగలగాలి. ఏ అడుగైనా అప్రమత్తంగానే వేయాలి. అన్ని రకాలుగా సాంకేతిక, మార్గదర్శక సహాయం అందించడానికి ఏపిమాస్ మీకు ఎప్పుడూ అండగానే వుంటుంది. ఆపదనే అవకాశంగా మలచుకుందాం! క్రిందటి ఏడాది మనం సాధించిన రికార్డులను మనమే తిరగరాద్దాం!

టి. చంద్రశేఖర రెడ్డి


Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.Chandra Sekhar Reddy


నీకే కాదు నీ శత్రువుకూ స్వేచ్ఛ అవసరమే ; లేకుంటే నీ స్వేచ్ఛకు ప్రమాదం పొంచి వున్నట్టే

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....


- ఏపిమాస్ కార్యక్షేత్రాలలో మహిళా దినోత్సవం ...05
- వ్యవసాయంలో కొత్త పద్దతి 'సోలార్ లైట్ ట్రాప్' ...07
- 'మౌలిక సామర్థ్య వినియోగం తీరు... ...08
- స్వయం సమృద్ధి దిశగా మహిళలు అడుగులు ..09
- నాబార్డ్ ఛైర్మన్‌కు అంతర్జాతీయ పదవి ! ...10
- ఎఫ్ పి ఓ లకు నాబార్డ్ చేయూత ...11
- 'రైతులు తమ పంటల విలువ పెంచుకోవాలి' ...12
- గిరిజన ఎఫ్.పి.ఓ ప్రతినిధులకు శిక్షణ ...13
- భువనగిరిలో ఎఫ్‌పిఓ, ఎస్‌హెచ్‌జి ఎగ్జిబిషన్ ...15
- ఒక జిల్లాలో ఒకే పంట ... కేంద్రం ఆదేశం! ...16
- తెలంగాణాలో 20వేల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ...17
- తెలుగింటి 'వన రాణి' రామలక్ష్మి ! ...18
- వివరాలు లేవని బీమాను తిరస్కరించకూడదు ...19
- వితంతు, ఒంటరి మహిళలకు పింఛన్ ఆపవద్దు ...20
- ఒడిశాలో ఫలిస్తున్న ఎఫ్ పి సి ప్రయోగం ! ...21
- అతివృష్టినుంచి ఎత్తు మడులతో పంటలకు రక్షణ ...24
- మజ్జిగ పానీయాలతో వేసవిని గెలవండి ! ...26
- చేపల పెంపకంలో నూతన ప్రక్రియలు ! ...29
- జీవ వైవిధ్య పరిరక్షణ సమాజ బాధ్యత ! ...33


**గమనిక :** 'మహిళా సాధికారత' అనంతమైన భిన్నత్వం నుంచి ఆవహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.

### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

**ఓర్పు ఎంత కష్టమనిపిస్తుందో, దాని వల్ల కలిగే ప్రతిఫలం అంత ఆనందంగా వుంటుంది**

# ఏపిమాస్ కార్యక్షేత్రాలలో మహిళా దినోత్సవ సంబరాలు !

**– ఎస్.ప్రహల్లాద, సి.గోపాలరాజు, సి.రాజశేఖర్ రెడ్డి,**

'నేటి కోవిడ్ 19 ప్రపంచంలో ... సమాన భవిష్యత్‌ను సాధిస్తున్న మహిళా నాయకత్వం' అనే నినాదంతో మార్చి నెల 8వ తేదీన ప్రపంచవ్యాప్తంగా మహిళా దినోత్సవ సంబరాలు మిన్నంటాయి.

"ప్రపంచ జనాభాలో సగం మంది మహిళలే: మిగిలిన సగంమంది కూడా మహిళల నుండి ఉద్భవించిన వారే" అనేది యదార్థం. ఒకవైపు కుటుంబంలోనూ, మరోవైపు సమాజ అభివృద్ధిలోనూ కీలక భూమిక పోషిస్తున్న మహిళల త్యాగాలకు తగిన గుర్తింపులేకపోతున్నది. తల్లి, చెల్లి, అక్క, స్నేహితురాలు, శ్రేయోభిలాషి మొదలగు వివిధ పాత్రలు పోషిస్తూ కుటుంబ వ్యవస్థకు మూలస్తంభంగా నిలుస్తున్న స్త్రీ శక్తి సామర్థ్యాలను సమాజం అంతగా గుర్తించలేక పోతున్నది. అందువలన ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం మార్చి నెల 8వ తేదీన 'అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని' ప్రపంచవ్యాప్తంగా నిర్వహించి మహిళల త్యాగాలను, శక్తి సామర్థ్యాలను, సమాజంలో వారు నిర్వహిస్తున్న కీలక పాత్రను ప్రపంచం దృష్టికి తేవాలని సంకల్పించింది. అందుకే ప్రతి సంవత్సరం మార్చి నెల 8వ తేదీన ప్రపంచవ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము.

ఏపిమాస్ తాను క్రియాశీలంగా పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్ రాష్ట్రాలలోని తన కార్యక్షేత్రాలలో ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, వివిధ రూపాలలో మహిళలు పోషిస్తున్న విభిన్న పాత్రల గురించి చర్చించి, మహిళలకు సమాన స్థాయి, సమాన గౌరవ ప్రతిపత్తుల ఆవశ్యకతను వివరించింది.

**వి.కోటలో మహిళా దినోత్సవం**

చిత్తూరు జిల్లా పలమనేరు, వి.కోట మండలాల తరపున వి.కోటలో మహిళా దినోత్సవాన్ని చాలా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఏపిమాస్ నుండి జిఐసి ప్రాజెక్టు సంచాలకులు శ్రీ జయరాం, శ్రీమతి భవాని, కుమారి లిఖిత, శ్రీ ప్రహల్లాద అతిధులుగా హాజరై సమాజంలోని వివిధ రంగాలలో మహిళల పాత్రను,




వారి త్యాగాలను కొనియాడారు. కుటుంబంలోనూ, సమాజంలోను మహిళలు ఎంత కీలకమైన పాత్ర పోషిస్తున్నప్పటికీ మహిళలు ఆర్థిక స్తోమత కలిగివుండి, వారి పేరుపైన ఆస్తి ఉన్నప్పుడు మాత్రమే వారికి అటు సమాజంలోను, ఇటు కుటుంబంలోనూ గుర్తింపు వుంటుందని వక్తలు పేర్కొన్నారు.

**రోజుకు 17 గంటల పని**

ఈ కార్యక్రమంలో శ్రీమతి భవాని ఒక స్త్రీ ప్రతి రోజు సగటున ఎన్ని గంటలు పని చేస్తున్నదని అడుగగా అందరూ కూడా ఉదయం 4.30 నుండి రాత్రి 10.30 గంటల వరకు అనగా 17 గంటలు పని చేస్తున్నదని వివరించారు. గ్రామీణ ప్రాంతాలలలో మగవారు కూడా యించుమించు మహిళలతో సమానంగా పని చేస్తున్నప్పటికీ వారు సాధారణంగా పాలు పితుకుట, వ్యవసాయం, ఇతర బయటి పనులు మాత్రమే చేస్తారని తెలిపారు. అయితే, మహిళలు పురుషులతో పాటు ఈ అన్ని పనుల్లో వారికి సహకరిస్తూనే కుటుంబంలో ఇల్లు శుభ్రం చేయుట మొదలుకొని, మూడు పూటలా భోజనము తయారుచేయుట, చిన్న పిల్లలు వున్న

కుటుంబాలలో వారికి స్నానపానాదులు చేయించి బడికి పంపుట మొదలగు అనేక పనులను నిర్వహిస్తూ కుటుంబంలో అన్నీ తామై వ్యవహరిస్తున్నారని, అయినప్పటికీ సమాజంలో స్త్రీకి తగినంత ప్రాధాన్యం లభించడంలేదని వివరించారు. అందువల్ల కేవలం ఇటువంటి ఉత్సవాల సందర్భాలలోనే కాకుండా నిత్య జీవితంలో స్త్రీ కి సముచిత స్థానం కల్పించాలని వక్తలు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో వి.కోట, పలమనేరు రైతు ఉత్పత్తిదారు సంస్థల (ఎఫ్ పి ఓ ల) మహిళా కార్యవర్గ సభ్యులు శ్రీమతి జమునా రాణి, శ్రీమతి వసంతాబాయి, శ్రీమతి కవిత అటు వ్యవసాయంలో, ఇటు రైతు



ఉత్పత్తిదారుల సంస్థ బలోపేతంలో మహిళా కార్యవర్గ సభ్యుల పాత్రను, వారు చేపట్టిన కార్యక్రమాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీమాస్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీ అమరేంద్ర, సిబ్బంది శ్రీ గుణశేఖర్, కుమారి వాణిశ్రీ, శ్రీ వేంకటపతి రాజు, శ్రీ హరికృష్ణ, శ్రీ టినోజ్ కుమార్‌తో పాటు రెండు మండలాల నుండి దాదాపు 50 మంది రైతు ఉత్పత్తిదారుల సంస్థల కార్యవర్గ సభ్యులు, ఇతర సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**సాంస్కృతిక కార్యక్రమాలు:** ఈ సమావేశానికి హాజరైన మహిళలు బెలూన్ల ఆటలు, మ్యూజికల్ చైర్స్, ఆటలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్తేజకరమైన చైతన్య గీతాలను పాడారు. మహిళల అమోఘమైన శక్తి సామర్థ్యాలపై చక్కగా ప్రసంగించారు. అనంతరం పాటలు పాడినవారికి, ఉత్తమ ఉపన్యాసకులకు, రైతు సంస్థల బలోపేతానికి కృషి చేస్తున్న మహిళలకు బహుమానాలు అందజేయడంతో ఉత్సవాలు ముగిశాయి.

**కలికిరిలో మహిళా దినోత్సవ కార్యక్రమాలు :** కలికిరి రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్ పి ఓ), పీలేరు రైతు



ఉత్పత్తిదారుల కంపెనీ (ఎఫ్ పి సి), కలికిరి కృషి కృషి విజ్ఞాన కేంద్రం (కే వి కే) సంయుక్తంగా నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఏపిమాస్ నుండి శ్రీమతి కళామణి గారు హాజరై వివిధ రంగాలలో మహిళలు పోషిస్తున్న విభిన్న పాత్రలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర అధికారులు, ఏపీమాస్ నుండి శ్రీ వినాయక రెడ్డి, శ్రీ జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీ రమేశ్ రెడ్డి, శ్రీ శ్రీనివాసరెడ్డి, శ్రీ అజిత్, కుమారి దివ్య, శ్రీమతి సునీతలతో పాటు కలికిరి రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులు దాదాపు 80మంది పాల్గొని మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

**కురబలకోటలో ... :** కురబలకోట, వాల్మీకిపురం రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓ లు) కలసి అంగళ్ళు లో స్థానిక స్వచ్ఛంద సంస్థ 'ఆర్ఆర్ఎస్' సహకారంతో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సమావేశంలో వాల్మీకిపురం ఎఫ్ పి ఓ అధ్యక్షులు శ్రీ సదాశివరెడ్డి, కురబల కోట ఎఫ్ పి ఓ అధ్యక్షురాలు శ్రీమతి శిరీషతోపాటు ఇతర వక్తలు సమాజంలోను, కుటుంబంలోను మహిళలు పోషిస్తున్న వివిధ రకాల నాయకత్వ బాధ్యతల గురించి, మహిళలు చేపట్టదగిన రకరకాల ఆదాయ మార్గాల గురించి వివరించారు. అనంతరం రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్న మహిళలకు బహుమానాలు

పదవి, అధికారం, సంపద శాశ్వతం కావు; చక్కని వ్యక్తిత్వం, వివేకం మనిషిని చిరంజీవిని చేస్తాయి

అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏపీమాస్ నుండి నివేదిత గారు, ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్ ఖాదర్‌గారు, శ్రీ నారాయణ రెడ్డి, కుమారి పద్మజ, కుమారి మానస, శ్రీ నిజాం తదితర సిబ్బందితో పాటు రెండు మండలాల నుండి రైతు ఉత్పత్తిదారుల సంస్థల కార్యవర్గ సభ్యులు, సాధారణ సభ్యులు దాదాపు 70 మంది పాల్గొన్నారు. ఈ సమావేశానికి ప్రముఖ ఎరువుల తయారీ సంస్థ 'కోరమాండల్' ప్రతినిధులు పాల్గొని మహిళాభివృద్ధికి వారు చేస్తున్న కృషిని వివరించారు.

**నల్లమాడ, గుడిబండ మండలాలలో ...**

అనంతపురం జిల్లా నల్లమాడ మండలం, గుడిబండ మండలాలలో మార్చి 8వ తేదీన ఏపిమాస్ (క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్), 'వెలుగు మండల మహిళా సమాఖ్య'ల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం మండల మహిళా సమాఖ్య కార్యాలయ ఆవరణలో జరిగింది. మహిళా దినోత్సవం సందర్భంగా 'ఈ సంవత్సరం మహిళా నాయకత్వం ... కోవిడ్ సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు - సాధించిన ప్రగతి' గురించి చర్చించారు. మొదటి పోటీగా మహిళల నాయకత్వం గురించి, రెండవ పోటీగా సుస్థిర వ్యవసాయం, సుస్థిరమైన పర్యావరణంలో మహిళల పాత్రపై ఉపన్యాస పోటీలను నిర్వహించారు. మూడవ పోటీగా మ్యూజికల్ ఛైర్స్ పోటీ నిర్వహించారు.

అనంతరం పోటీలలో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఆదర్శ మహిళా రైతులను ఘనంగా సన్మానించారు. గుడిబండ మండలానికి చెందిన కొంకల్లు గ్రామం పద్మావతి, యం. యస్. తాండా గ్రామం గంగమ్మ, నల్లమాడ మండలానికి చెందిన పాటబత్తలపల్లి గ్రామం సుభాషిణి, గోపేపల్లి గ్రామం ఆనంతమ్మను సన్మానించారు.

గుడిబండ మండలంలో 83 మంది మహిళా సంఘ సభ్యులు, వెలుగు సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, యానిమేటర్స్, ఏపీమాస్ సిబ్బంది హాజరయ్యారు. నల్లమాడ మండలంలో 82 మంది మహిళా సంఘ సభ్యులు, వెలుగు సిబ్బంది, ఏపీమాస్ సిబ్బంది హాజరయ్యారు. ■

## వ్యవసాయంలో కొత్త పద్ధతి 'సోలార్ లైట్ ట్రాప్' !

- ఇది సౌరశక్తి ద్వారా నడుస్తుంది, కరెంట్ అవసరం లేదు.
- ఇది ఆటో సెన్సర్ ద్వారా పని చేస్తుంది, చీకటిపడగానే లైట్ ఆన్ అవుతుంది. ఉదయం వెలుతురు రాగానే ఆటోమాటిగ్‌గా ఆఫ్ అవుతుంది. ప్రతిరోజు మనం వెళ్లి ఆన్ / ఆఫ్ చేయాల్సిన అవసరం లేదు.
- లైట్ వెలుతురుకు ఒక ఎకరా విస్తీర్ణంలోని రసంపీల్చే పురుగులు, రెక్కల పురుగులు ఆకర్షించబడి లైట్ చుట్టూ వున్న తెరకు తగలడం ద్వారా షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోతాయి (దోమలు మన ఇంట్లో దోమల బ్యాట్‌కు తగలగానే చనిపోయినట్లు చనిపోతాయి).



- ఒక్కసారి కొని పంట మధ్యలో పెడితే చాలు, పంట అయిపోన తరువాత తీసి మరల తర్వాతి పంటలకు వాడుకోవచ్చు, ఇలా అనేక సంవత్సరాలు పనిచేస్తుంది.
- దీనిని అన్నిరకాల పంటలలో వాడుకోవచ్చు. ముఖ్యంగా ఉద్యాన వాణిజ్య పంటలయిన మిర్చి, కూరగాయలు, పసుపుతో పాటు పత్తి, వరి పంటలలో కూడా వాడుకోవచ్చు.
- దీనివల్ల అనేక చీడపీడల నుండి పంటలను రక్షించుకోవచ్చు. తద్వారా పురుగు మందుల పిచికారికై పెట్టే ఖర్చులను 70% తగ్గించుకోవచ్చు.
- ప్రతి రైతు దీనిని వాడుకొని చీడ పీడలనుండి పంటలను రక్షించుకొని పెట్టుబడులను తగ్గించుకొని అధిక దిగుబడి అధిక ఆదాయాన్ని పొందగలరు. ■

# 'మౌలిక సామర్థ్య వినియోగం తీరును సమీక్షించుకోవాలి'

ఏపిమాస్ 'సంస్థాగత వ్యూహ పత్రం 2030' రూపకల్పన ప్రక్రియలో భాగంగా, ఏపిమాస్ పనిచేసే వివిధ రంగాలపై విశ్లేషణాత్మకంగా చర్చించడానికి ఆ రంగాలలో విశేషానుభవం వున్న ప్రముఖులతో పాలసీ చర్చ నిర్వహించాని సంకల్పించిన ఏపిమాస్ యిప్పటికి సంస్థాగతంగా రెండు చర్చావేదికలను , సంస్థేతర నిపుణులతో రెండు చర్చావేదికలను మొత్తం నాలుగు చర్చావేదికలను నిర్వహించింది. 'భారతదేశంలో పౌర సంస్థల నిర్వహణలో మారుతున్న వాతావరణం ... ఏపిమాస్‌కు ఎదురయ్యే సవాళ్ళు , భవిష్యత్తు' అనే అంశంపై ఐదవ చర్చావేదికను 2021 ఫిబ్రవరి 10 వ తేదీన నిర్వహించారు. ఈ రంగానికి చెందిన నిపుణుడు, 'సమున్నతి' సంస్థ ఛైర్మన్ శ్రీ ఎన్ శ్రీనివాసన్ ప్రధాన వక్తగా పాల్గొన్నారు. రాబోయే పదేళ్ళ కాలంలో నిర్వహణపరంగా ఏపిమాస్ అనుసరించవలసిన వ్యూహాలపై మార్గదర్శనం చేయవలసిందిగా కూడా శీ ఎన్ శ్రీనివాసన్ ను ఏపిమాస్ కోరింది.

తొలుత ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి చర్చాగోష్ఠిని ప్రారంభిస్తూ, నాటి ప్రధానవక్త శ్రీ శ్రీనివాసన్ ను గురించి వివరించడంతోపాటు, తాము ఎన్నుకున్న చర్చనీయాంశ ప్రాముఖ్యాన్ని వివరించారు.

అనంతరం శ్రీ శ్రీనివాసన్ ప్రసంగిస్తూ, ఏపిమాస్‌తో చాలాకాలంగా తనకున్న సన్నిహిత అనుబంధాన్ని, అభివృద్ధిరంగంలో ఏపిమాస్ విజయవంతంగా సాగిస్తున్న ప్రస్థానంలో ప్రధానచోదకశక్తిని గురించి తన జ్ఞాపకాలను, అనుభవాలను గుర్తుచేసుకున్నారు.గత రెండు దశాబ్దాలుగా ఏపిమాస్ నిర్వహించిన ప్రధాన కార్యక్రమాలన్నిటిని గురించి తనకు గాఢమైన పరిచయం, ఆవగాహన వున్నాయని ఆయన చెప్పారు. ఈ క్రింది అంశాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు:

- ఏ సంస్థ ఆయినా గతంనుంచి పాఠాలను నేర్చుకోవాలి. వేటిని గరిష్ఠంగా విస్తరించాలి, వేటిని గురించి పునరాలోచించాలి, వేటిని వదిలివేయాలి , కొత్తగా వేటిని చేపట్టాలి అనే అవగాహన వుండడం అవసరం.
- పేరేమో ఏ పి , పనిచేయవలసిందేమో భారతదేశమంతటా కావడంతో మొదట్లో ఏపిమాస్ కొంత యిబ్బందిని ఎదుర్కొన్నది.
- మరో విశేషం ... ఏపిమాస్ తన పేరులో 'మహిళాభివృద్ధి' అని వున్నప్పటికీ కేవలం 'మహిళల' కే పరిమితం కాలేదు.
- 20 ఏళ్ళు నిండుతున్నాయి. అంటే ఇక ఎంతమాత్రం ' టీనేజర్ ' కాదు. యవ్వనంలోకి ప్రవేశిస్తున్నది.
- స్వయంసహాయ సంఘాల (ఎస్ హెచ్ జి) సమాఖ్యల ఉద్యమంలో చాలా ప్రత్యేకమైన పాత్రను, అగ్రగామి పాత్రను ఏపిమాస్ పోషించింది.

ఈ సమాఖ్యలకు సుప్రసిద్ధమైన ఇతర సంస్థలతో ఏపిమాస్ అనుసంధానం కల్పించింది. ఆ కారణంగా ఏపిమాస్ విజ్ఞాన భాగస్వామిగా, సంస్థల సలహాదారుగా, వివిధ వేదికలలో, వివిధ స్థాయిలలో విధానపరమైన సమన్వయకర్తగా ఎదిగింది. ఉన్నతమైన శిక్షణలతో సి ఆర్ పి లను, ఎన్ జి ఓ నిపుణులను, ప్రభుత్వ ప్రతినిధులను శిక్షకులకు శిక్షణ యివ్వడానికి సమర్థులుగా ఏపిమాస్ తీర్చిదిద్దింది.

గత రెండు దశాబ్దాల కాలంలో ఏపిమాస్ వివిధ నమూనాలపై ప్రయోగాత్మక కృషి సాగించిందని, సత్ఫలితాల సాధనలో రికార్డు సృష్టించిందని శ్రీ శ్రీనివాసన్ కొనియాడారు.

ఏపిమాస్ ప్రస్థానంలో అంతగా ఫలప్రదంకాని అంశాలగురించి శ్రీ శ్రీనివాసన్ ప్రస్తావిస్తూ, విజ్ఞాన సంస్థ అయినప్పటికీ ప్రభుత్వరంగంతో అనుబంధం కారణంగా విమర్శనాత్మకంగా వ్యవహరించలేకపోయిందని అభిప్రాయపడ్డారు.

సమాఖ్యల స్వయంనియంత్రణ అనేది (డి జి ఆర్ వి భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న ఎస్ ఓ సి) ప్రయోగాత్మక, ప్రభావోత్పాదక కార్యక్రమం. అయితే, యిటు ప్రభుత్వ సాధనాలద్వారా కాని లేదా అటు ఆర్థికరంగ నియంత్రణ

క్షమాపణ చెప్పడం అంటే తప్పు చేసినట్టు ఒప్పుకోవడం కాకపోవచ్చు, స్నేహ బంధాన్ని గౌరవించడం కావచ్చు

సాధనాల ద్వారా కాని దీనిని అన్వయించడం కుదరదు. దృష్టి కేంద్రీకరణ ఎప్పటికప్పుడు మారుతుండడం వనరుల వినియోగంపై, ఉత్పాదకతపై ఏమైనా ప్రభావం చూపిందా అనేది గమనించవలసిన మరొక అంశమని శ్రీ శ్రీనివాసన్ అన్నారు. తన మౌలిక సామర్థ్యాన్ని ఏపిమాస్ గరిష్ఠంగా వినియోగించుకోగలిగిందా లేదా అనేది కూడా గమనించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

ఏపిమాస్ ఆశయం (విజన్) , ఆశయ సాధన మార్గం (మిషన్) గురించి తన అంచనాను, అవగాహనను శ్రీ శ్రీనివాసన్ వివరించారు. ■

## అమెరికాలో న్యాయమూర్తిగా తెలుగు మహిళ నియామకం !



అమెరికాలో తెలుగు మహిళను కీలక పదవి వరించింది. వాషింగ్టన్ డీసీ జిల్లా కోర్టు జడ్జిగా పుట్టగుంట రూపా రంగాను ఆ దేశపు అధ్యక్షుడు జో బైడెన్ నియమించారు. ఆమె తల్లిదండ్రులది కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కలువపాముల. రూప తల్లిదండ్రులు పుట్టగుంట పున్నమ్మ, రంగా ఇద్దరూ వైద్యులు. అమెరికాలో వారు స్థిర పడ్డారు. కాగా 15 ఏళ్ల క్రితం అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పున్నమ్మ మృతి చెందారు.

రూప నియామకాన్ని అమెరికన్ సెనెట్ ఆమోదించవలసివుంది. సెనేట్ ఆమోదం లభిస్తే రూపా రంగా వాషిం గ్టన్ డి సి జిల్లా కోర్టుకు నియమితురాలైన తొలి 'ఏసియన్ అమెరికన్ పసిఫిక్ ఐలాండర్' (ఏఏపిఐ) మహిళా న్యాయమూర్తి అవుతారని వైట్ హౌస్ వర్గాలు పేర్కొన్నాయి.

జడ్జి రూప ప్రస్తుతం డి సి లోని అద్దె ఇళ్ళ కమిషన్‌కు అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా పనిచేస్తున్నారు. అంతకు ముందు 2013 నుంచి 2019 వరకు న్యాయవాదిగా పనిచేశారు. న్యాయవాదిగా డి సి సుపీరియర్ కోర్టుకు చెందిన కుటుంబ వ్యవహారాల న్యాయస్థానంలో ఆమె గృహహింస బాధితుల తరపున ఉచితంగా వాదించేవారు. ■

## ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పంట హాప్ షూట్స్... !

**హా**ప్ షూట్స్.... ఈ పేరు భారతదేశ ప్రజలకు చాలా కొత్తగా ఉండొచ్చు కానీ, పాశ్చాత్య దేశాల వారికి చిరపరిచితమే. కూరగాయలు, ఆకు కూరల తరహాలో ఇదొక పంట. అయితే అలాంటి ఇలాంటి పంట కాదు... కిలో రూ. 85 వేలు పలికే సిరుల పంట. ప్రస్తుతం దీన్ని మన దేశంలోనూ పండిస్తున్నారు.



బీహార్ కు చెందిన అమ్రేష్ సింగ్ (38) అనే రైతు తన పొలంలో హాప్ షూట్స్ ను సాగు చేస్తున్నాడు. ఈ మొక్కలోని పువ్వు భాగాన్ని ఆహారంగా స్వీకరిస్తారు. పైగా, మానసిక రుగ్మతలను తగ్గించే ఔషధాల్లోనూ, బీరు తయారీలో దీన్ని విరివిగా ఉపయోగిస్తుండడంతో అంత ధర పలుకుతోంది. ఈ పంట సాగు కోసం అమ్రేష్ రూ. 2.5 లక్షలు వెచ్చించాడు. ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా పూర్తిగా ఆర్గానిక్ పద్ధతిలో సేద్యం చేస్తున్నాడు. హాప్ షూట్స్ ను శాస్త్రీయంగా హ్యూములస్ లుపులస్ అని పిలుస్తారు. దీన్ని భారత్‌లో తొలిసారిగా వారణాసిలోని ఇండియన్ వెజిటబుల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో సాగు చేశారు. బీహార్ రైతు అమ్రేష్ వీటిని వారణాసి నుంచే తీసుకువచ్చి తన స్వగ్రామం కరాందీలో సాగు చేస్తున్నాడు. ■

# నాబార్డ్ ఛైర్మన్ శ్రీ చింతలకు అంతర్జాతీయ పదవి !

## ఆప్రాకా ఛైర్మన్‌గా నియామకం ... తెలుగు వ్యక్తికి తొలిసారి దక్కిన గౌరవం !

**నా**బార్డ్ ఛైర్మన్‌గా పని చేస్తున్న తెలుగు వ్యక్తి డాక్టర్ చింతల గోవిందరాజులుకు మరో అరుదైన గౌరవం దక్కింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ కేంద్రంగా పనిచేస్తున్న 'ఆసియా పసిఫిక్ గ్రామీణ వ్యవసాయ పరపతి సంఘం' (ఆప్రాకా) ఛైర్మన్‌గా ఆయన ఎన్నికయ్యారు. ఆయన రెండేళ్ళపాటు ఈ పదవిలో ఉంటారు. ఈ సంఘాన్ని 1977లో భారత్ సహా 16 దేశాల గ్రామీణ, వ్యవసాయాభివృద్ధి అత్యున్నత స్థాయి బ్యాంకులు సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. ప్రస్తుతం చైనా, జపాన్, వియత్నాం తదితర 24 దేశాలు ఇందులో సభ్యత్వం కలిగి ఉన్నాయి. మన దేశంలో గ్రామీణ, వ్యవసాయాభివృద్ధి రంగాలకు అత్యున్నత బ్యాంకుగా నాబార్డు పని చేస్తోంది. ఇలాగే 24 దేశాల్లోని అత్యున్నత బ్యాంకుల ఛైర్మన్ల నుంచి ఆప్రాకా ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. దీనికి ఈసారి చింతల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైనా అత్యున్నత బ్యాంకు ప్రతినిధి ఆప్రాకా ఉపాధ్యక్షుడి హోదాలో చింతలకు సహాయకారిగా పని చేస్తారు.




ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల కూటములకు ప్రాంతీయ స్థాయిలో ఆప్రాకా తరహా సంఘాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా గ్రామీణ, వ్యవసాయాభివృద్ధి రంగాలకు రుణ పంపిణీ విధానాలపై కొత్త ఆలోచనలను పంచుకోవడానికి, అమలులో ఆయా దేశాలకు సిఫార్సులు చేయడానికి ఆప్రాకా కృషి చేస్తుంది. ఇంతకుముందు ఒక భారతీయుడికి ఈ పదవి దక్కింది.

**వాతావరణ మార్పులపై పోరు**

ఆప్రాకా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ముంబయిలోని నాబార్డు ప్రధాన కార్యాలయం నుంచి చింతల ఆన్‌లైన్‌లో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులతో సవాళ్ళు పెరుగుతున్నాయని, చిన్న కమతాల రైతులను వీటి నుంచి రక్షించేందుకు ఏం చేయాలనే దానిపై ఆప్రాకా దృష్టి పెడుతుందన్నారు. పేద రైతుల పరిరక్షణకు నూతన ప్రణాళికలు అవసరమని, వాటి రూప కల్పనకు కృషి చేస్తానన్నారు. ఇందుకోసం వివిధ దేశాల మధ్య ఆలోచనలను పంచు కోవడం, కొత్త ప్రాజెక్టుల అమలు, పరస్పర సహకారం అందించడానికి తనవంతు పాత్ర నిర్వహిస్తానన్నారు.

**మన పునాదులను, వేర్లను మరిచిపోకూడదు**

నాబార్డ్ ఛైర్మన్ శ్రీ గోవిందరాజులు గుంటూరు జిల్లాలోని పొన్నూరు మండలంలోని తన స్వగ్రామం బ్రాహ్మణకోడూరులో రామినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన రైతు సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామానికి చెందిన అనేకమంది తనకంటే ముందే ఉన్నత స్థానాలకు ఎదిగారన్నారు. ఈ సమయంలో ప్రతిష్ఠాత్మకమైన బ్యాంక్‌కు ఛైర్మన్ కావటం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.ఎంత ఎత్తుకు ఎదిగినా మన పునాదులు, వేర్లు మరిచిపోకూడదని ఆయన పేర్కొన్నారు. భారత దేశంలో ఆరు లక్షల గ్రామాలున్నాయని, డెబ్భై కోట్ల మంది వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారన్నారు. మహిళలకు సాధికారిత కోసమే సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతుల భవిష్యత్ బాగుండాలంటే పంట మార్పిడి చేసి భూసారాన్ని కాపాడుకోవాలని గోవిందరాజులు సూచించారు.

(ఈనాడు సౌజన్యంతో)

**దుర్వినియోగం తీరని ద్రోహం, నీవు వేటిని వ్యర్థం చేస్తున్నావో అవి లేక కుమిలిపోతున్న వారెందరో !**

# ఎఫ్ పి ఓ లకు నాబార్డ్ చేయూత

**అ**న్నదాతల ఆదాయం పెంచేందుకు ఉద్దేశించిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలను (ఎఫ్ పి ఓ లను) పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) నిర్ణయించింది. ఇందులో భాగంగా




ఎఫ్‌పీఓలకు ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని అందిస్తుంది. ఆయా సంఘాల సభ్యులు ఉత్పత్తి చేసే పంటలకు గిట్టుబాటు ధర లభించేలా చేస్తుంది. రైతులే తమ ఉత్పత్తులకు ధరలు నిర్ణయించుకుని మార్కెటింగ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తుంది. దీంతోపాటు వ్యవసాయానికి ఆధునిక సాంకేతికత జోడించి సాగులో శారీరక శ్రమను తగ్గించేలా రైతులకు శిక్షణ ఇస్తుంది. హైటెక్ వ్యవసాయానికి చేయూతనిస్తుంది. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేలా ఆధునిక పరికరాల వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది. ఎఫ్‌పీఓల ద్వారా రైతులు ఆధునిక సాంకేతిక పరికరాలను, పనిముట్లను కొనుగోలు చేసుకునేందుకు చర్యలు తీసుకుంటుంది. నాబార్డ్ నేరుగా కాకుండా బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తుంది.




వ్యవసాయ సుస్థిరాభివృద్ధికి మార్గాలను అన్వేషించే క్రమంలో రైతుల భాగస్వామ్యం ఉండేలా సూచనలు, సలహాలు, శిక్షణ ఇస్తుంది. రైతు సంక్షేమం, శ్రేయస్సే లక్ష్యంగా వ్యవస్థాగత అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుంది. రైతుల ఉండే ఆర్థిక చేయూత, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక తోడ్పాటు ఇందులో కీలకంగా ఉంటాయి.

**మహిళా ఉపాధికి ఊతం**

మహిళలకు నూతన జీవనోపాధి కల్పనకు నాబార్డ్ ఆర్థిక సహకారం అందిస్తుంది. స్వయంపోషక సంఘాల సభ్యులుగా ఉండే మహిళలకు అండగా నిలుస్తుంది. ఉత్పత్తుల తయారీతో పాటు మార్కెటింగ్‌కు అవకాశాలు చూపిస్తుంది. గ్రామీణ రోడ్లు, వంతెనలు, పాఠశాల భవనాలు వంటి మౌలిక వసతులకు గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తుంది. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యతకు కృషి చేస్తుంది. ఇందుకోసం బ్యాంకులకు నిధులు ఇస్తుంది. మొబైల్ యాప్‌ల వినియోగం, ఏటీఎం కార్డుల ఉపయోగం తదితర అంశాలపై గ్రామీణ ప్రజలకు శిక్షణ ఇస్తుంది. గిరిజన ప్రాంతాల్లో ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు రైతులకు అండగా నాబార్డ్ నిలుస్తుంది.

– సాక్షి సౌజన్యంతో

# 'రైతులు తమ పంటల విలువ పెంచుకోవాలి'





రైతులు తాము పండించిన ఉత్పత్తులను స్వయంగా అమ్ముకునే స్థాయికి ఎదగాలని అరబిందో ఫార్మా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ నిత్యానందరెడ్డి అన్నారు. పీలేరులో ఏపీమాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీలేరు రైతు ఉత్పత్తిదారుల సంఘానికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ నిత్యానందరెడ్డి రూ. 60 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సహాయంతో రైతులు అందరూ కలిసి 'కష్టం హైరింగ్ సెంటర్ ' ను (వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రాన్ని) ప్రారంభించారు.



వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిత్యానందరెడ్డి

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నిత్యానందరెడ్డి మాట్లాడుతూ రైతులందరూ కలిసికట్టుగా వ్యవసాయం చేయడమే కాకుండా ఉత్పత్తుల్ని స్వయంగా అమ్ముకోవడం, విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి చెందాలని కోరారు. ఏపీమాస్ సీఈఓ సిఎస్ రెడ్డి మాట్లాడుతూ రైతులను, మహిళలను సంఘాలుగా ఏర్పాటు చేసి వారి ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడమే తమ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈసందర్భంగా 50 మంది మహిళా రైతులకు ఒక్కొక్కరికి 20 కోడిపిల్లల చొప్పున అందించారు. ఏడుగురు రైతులకు గడ్డికోసే యంత్రాన్ని మరికొంతమందికి సబ్సిడీ ధరతో పశువుల గడ్డి, ఎరువులు అందించారు.

ఏపీమాస్ సీఈవో సీఎస్ రెడ్డి, డైరక్టర్ వినాయకరెడ్డి, అరబిందో ఫార్మా ఫౌండేషన్ ట్రస్టీ నిత్యానందరెడ్డి కుమార్తె డాక్టర్ కీర్తిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కడప గిరిధర్‌రెడ్డి, ఎంపీపీ అభ్యర్థి కంభం సతీష్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ బీఎం రాజేశ్వరి, వ్యవసాయశాఖ ఏడీ మజీద్‌అహ్మద్, ఎస్పీవో డైరక్టర్లు పాల్గొన్నారు.

– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో

సమయం మించిపోలేదులే అనుకుంటూనే సమయం మించి పోవడం అసలు సమస్య

# గిరిజన ఎఫ్.పి.ఓ ప్రతినిధులకు శిక్షణ

– జి. శ్రీనివాస్, జి.ఆర్లిన్ క్రిస్టినా, జి. దివ్యశ్రీ

**యు.** యన్.డి.పి సంస్థతో భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా తెలంగాణలోని నాలుగు ఐ.టి.డి.ఏ ప్రాంతాలైన ఉట్నూర్, ఏటూరు నాగారం, మన్ననూర్, భద్రాచలంలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్ పి ఓ ల), సభ్యులకు, పాలకవర్గ సభ్యులకు ఏపిమాస్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు ఉద్దేశం, కార్యక్రమాలు, కోవిడ్ ప్రభావిత అంశాలపై 15 యఫ్.పి.ఓ లలోని 7,203 మంది సభ్యులకు 153 బ్యాచులుగా గ్రామస్థాయిలో కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్‌ల ద్వారా అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. 11మంది కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. రోజుకు ఒక రిసోర్స్ పర్సన్ రెండు బ్యాచులకు వంతున రోజుకు 20 బ్యాచులుగా శిక్షణ ఇచ్చి పూర్తి చేశారు. 12 యఫ్.పి.ఓ లకు చెందిన 152 మంది పాలకవర్గ సభ్యులు నాలుగు బ్యాచులుగా వ్యాపారాభివృద్ధి కార్యక్రమాలపై ఏపిమాస్ సిబ్బంది ద్వారా శిక్షణ పొందారు. ఎఫ్.పి.ఓ లలోని కమ్యూనిటి కేడర్‌కు (సామజిక కార్యకర్తలు) కూడా నాయకత్వం మొదలగు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది.



పాలకవర్గ సభ్యులకు ఏపిమాస్ సిబ్బంది అర్లిన్ క్రిస్టినా, జి.శ్రీనివాస్, దివ్యశ్రీ, కిశోర్ కుమార్, నవీన్‌కుమార్, రోహిత్, విష్ణు, రంజిత్, లక్ష్మీకాంత్ మొదలగువారు శిక్షణయిచ్చారు. ఏపిమాస్ ప్రధాన కార్యాలయం నుండి ఏపిమాస్ సి.ఇ.ఓ శ్రీ సి.ఎస్. రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ యన్. మధుమూర్తి తగిన సలహాలు, సూచనలు యిచ్చి శిక్షణ విజయవంతంగా పూర్తికావడానికి తోడ్పాటు అందించారు.



దేని ప్రత్యేకత దానిదే, అన్నిటికీ ఒకే కొలమానం కుదరదు; చెట్టెక్కలేదని సింహం పనికిమాలినదంటే ఎలా?




**సభ్యులకు శిక్షణ వివరాలు**

| శిక్షణ తేది | ఐ.టి.డి.ఏ పేరు | యఫ్.పి.ఓ ల సంఖ్య | బ్యాచ్ లు | శిక్షణ పొందిన సభ్యులు సంఖ్య |
|---|---|---|---|---|
| 11-18 ఫిబ్రవరి 21 | మన్ననూర్, భద్రాచలం, ఉట్నూర్, ఏటూరు నాగారం | 15 | 153 | 7203 |

**పాలకవర్గ సభ్యులకు శిక్షణ వివరాలు**

| శిక్షణ తేది | ఐ.టి.డి.ఏ పేరు, స్థలము | శిక్షణ పొందినవారి సంఖ్య |
|---|---|---|
| 24-26 ఫిబ్రవరి 2021 | మన్ననూర్ | 46 |
| 24-26 ఫిబ్రవరి 2021 | భద్రాచలం | 32 |
| 04 -06 మార్చి 2021 | ఉట్నూర్ | 38 |
| 16 - 18 మార్చి 2021 | ఏటూరు నాగారం | 36 |
| మొత్తం | | 152 |

■






నీవు చేయవలసింది నీ సవాళ్లను పరిమితం చేసుకోవడం కాదు, నీ పరిమితులను సవాలు చేయడం

# భువనగిరిలో ఎఫ్ పి ఓ, ఎస్ హెచ్ జి ఉత్పత్తుల ఎగ్జిబిషన్ !

– కె. నిమ్మయ్య

**ఎఫ్.** పి.ఓ.ల, ఎస్‌హెచ్‌జి ల ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలకు అవకాశం కల్పిస్తూ, 2021 మార్చి 23 నుండి 25 వరకు భువనగిరిలోని రావి భద్రారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నాబార్డ్ , భువనగిరిలోని 'పీస్' సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ ను నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 18 స్టాల్స్ ఏర్పాటయ్యాయి.



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ శ్రీమతి అనితా రామచంద్రన్ గారు జ్యోతి ప్రజ్వలనతో ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. సంబంధిత వివిధ శాఖలను, ఏజెన్సీలను సమన్వయపరచి ఎఫ్‌పిఓల స్థాయి మరింత మెరుగుపడేలా కృషిచేస్తానని కలెక్టర్ శ్రీమతి అనితా రామచంద్రన్ పేర్కొన్నారు. సమావేశానంతరం కలెక్టర్ గారు అన్ని స్టాల్‌లను సందర్శించి కొన్ని వస్తువులను కొనుగోలు చేశారు.

ఈ కార్యక్రమంలో ముందుగా పీస్ సంస్థ డైరెక్టర్ శ్రీ కె.నిమ్మయ్య ముఖ్య అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. కలెక్టర్ గారితో పాటు సీనియర్ ప్రొఫెసర్ శ్రీ ఎం.డి. ఆరీఫ్‌ఖాన్, డి.డి.ఎం. శ్రీ సత్యనారాయణ, రిటైర్డ్ తహసీల్దార్ శ్రీ కె. మోహన్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా రైతు సమన్వయ వేదిక అధ్యక్షులు శ్రీ కె.అమరేందర్, సి.డబ్ల్యూ.సి. ఛైర్‌పర్సన్ శ్రీమతి బండారు జయశ్రీ , గ్రామీణ మహిళా మండలి అధ్యక్షురాలు శ్రీమతి డి.విజయలక్ష్మి, షార్ప్ సంస్థకు చెందిన డా. ప్రమీల, పీస్‌సంస్థ నుండి కె. అరుణ గారు, గ్రామవికాస్ నుండి వి.స్వామి గారు, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. శ్రీ కొల్పుల అమరేందర్‌గారు మాట్లాడుతూ రైతులను చిన్నచూపు చూడకుండా, వారికి కావల్సిన రుణ సదుపాయాలు, గిట్టుబాటు ధర వచ్చేందుకు కృషి జరగాలని అన్నారు. సభాధ్యక్షత వహించిన శ్రీ కె.నిమ్మయ్య రైతు ఉత్పత్తిదారుల కంపెనీల నిర్వహణలోని సాధక బాధకాలను వివరించారు. చక్కని నిర్వహణతో అజీవ, ధీశాలి ఎఫ్‌పిఓలు జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచాయని తెలిపారు.

**ఆర్థిక అక్షరాస్యతా శిక్షణ**

2వ రోజున ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి బ్యాంకు ద్వారా ఎస్‌హెచ్‌జి మహిళలకు ఆర్థిక అక్షరాస్యతా శిక్షణ (ఫైనాన్షియల్ లిటరసి క్యాంపైన్) నిర్వహించారు.

3వ రోజున ఎగ్జిబిషన్ ముగింపు సమావేశంలో భువనగిరి మున్సిపాలిటీ ఛైర్మన్ శ్రీ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ ఛైర్మన్ శ్రీ చింత కిష్టయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇంకా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీ నాగార్జున, ఎ.పి.జి.వి.బి నుండి జగదీశ్‌కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రోటరీ క్లబ్ ఎలెక్టు అసిస్టెంట్ గవర్నర్ శ్రీ దిడ్డి బాలాజీ తదితరులు వేదికనలంకరించారు. మున్సిపల్‌ఛైర్మన్ శ్రీ ఆంజనేయులు మాట్లాడుతూ నూతనంగా నిర్మాణంలో ఉన్న మార్కెట్ కాంప్లెక్స్‌లో ఎస్.హెచ్.జి.లకు ఎఫ్.పి.ఓలకు స్థానం కల్పిస్తామని తెలిపారు. వైస్‌ఛైర్మన్ స్టాల్స్ అన్నీ సందర్శించి, నిర్వాహకులను అభినందించి కొన్ని వస్తువులను కొనుగోలు చేశారు.

స్టాల్స్ ఏర్పాటుచేసిన వారిని, ఎన్.జి.ఓ.ల, ఎఫ్.పి.ఓ.ల ప్రతినిధులను జ్ఞాపికలతో, శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమ నిర్వహణను తమ సంస్థకు అప్పగించినందుకు శ్రీ కె.నిమ్మయ్య నాబార్డ్ సంస్థకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. అతిథులకు, ఎన్.జి.ఓ.లకు, ఎఫ్.పి.ఓల ప్రతినిధులకు కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ■

ఎంత మంచిదైనా కేవలం సంకల్పం సరిపోదు, దానిని ఆచరణలో పెట్టాలి

# ఒక జిల్లాలో ఒకే పంట ... కేంద్రం ఆదేశం!

**రా**ష్ట్రాలలో ఏ జిల్లాలో ఏ పంట వేయాలనే అంశంపై కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రాల నుంచి పూర్తి సమాచారం, అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్రాలకు లేఖ రాసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ల లోని వివిధ జిల్లాల్లో సాగు చేయాల్సిన పంటలపై స్పష్టంగా వివరించింది. పంటల సాగుకు అనుగుణంగా స్థానికంగానే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై కూడా సూచనలు చేసింది.

దేశంలో రైతుల ఆదాయం రెట్టింపు చేసే విధానంలో భాగంగా కేంద్రం పలు నిర్ణయాలు తీసుకుంది. 'ఒక జిల్లా... ఒకే పంట' కార్యక్రమంలో భాగంగా 'ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ స్కీం' ను అమల్లోకి తీసుకువస్తోంది. మిషన్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్, నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, ప్రధానమంత్రి కృషి వికాస్ యోజనలో జిల్లాలవారీగా సాగు చేయాల్సిన పంటలను మార్గదర్శకాల్లో సూచించారు. రైతుల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయాలు తీసుకున్నామని, రాష్ట్రాలు అమలు చేయాలని పేర్కొన్నారు.

తెలంగాణా రాష్ట్రంలో ప్రధాన పంటలను కాదని తృణధాన్యాలు, మిర్చి వంటి పంటలతో పాటుగా మత్స్య అనుబంధ సాగును సూచించింది. నిజామాబాద్ జిల్లాలో పసుపు పంటను సూచించిన కేంద్రం, సిరిసిల్ల జిల్లాలో మత్స్య పెంపకాన్ని పేర్కొంది.

**ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కూడా**

జిల్లాల వారీగా పంటల సాగు సూచించిన కేంద్రం ఆ ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును కూడా తెలియచేసింది. సాగును బట్టి స్థానికంగా ఈ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొంది. కొన్నిచోట్ల ఇప్పటికే కొన్ని పరిశ్రమలున్నాయి. ఖమ్మంలో మిరప పౌడర్, వనపర్తిలో నూనె, మెదక్, వికారాబాద్ల్లో పండ్లు, చిల్లీ, టమాటా సాస్, జగిత్యాలలో మామిడిగుజ్జు, మహబూబ్నగర్లో సీతాఫలం, మామిడిగుజ్జు వంటి పరిశ్రమలు కొంతమేరకు నడుస్తున్నాయి. వీటిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిపిస్తున్నారు.

**తెలంగాణా జిల్లాలకు సూచించిన పంటలు**

ఆదిలాబాద్-సోయాబీన్, భద్రాద్రి కొత్తగూడెం-మిర్చి, జగిత్యాల-మామిడి, జనగామ-వరి (చిట్టిముత్యాలు), జయశంకర్ భూపాలపల్లి-మిర్చి, జోగులాంబ-వల్లి, కామారెడ్డి-సోయాబీన్ , కరీంనగర్-వరి, ఖమ్మం-మిర్చి, కుమ్రం భీం ఆసిఫాబాద్-తృణధాన్యాలు,మహబూబాబాద్-మిర్చి, మంచిర్యాల-మామిడి, ములుగు-మిర్చి, నాగర్ కర్నూల్-మామిడి, నల్గొండ- స్వీట్ ఆరెంజ్, నారాయణపేట-పల్లి,నిర్మల్-సోయాబీన్, నిజామాబాద్-పసుపు, పెద్దపల్లి-వరి, రాజన్న సిరిసిల్ల-ఫిషరీస్ (మత్స్య రంగం), రంగారెడ్డి -కూరగాయలు, సంగారెడ్డి - పాల ఉత్పత్తులు, సిద్ధిపేట-కూరగాయలు, సూర్యాపేట-పాల ఉత్పత్తులు, వికారాబాద్-కూరగాయలు, వనపర్తి - పల్లి, వరంగల్ రూరల్ - వెదురు, మిరప, యాదాద్రి భువనగిరి-పాల ఉత్పత్తులు.

నగర ప్రాంతాలైన హైదరాబాద్, వరంగల్ అర్బన్, మెదక్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలలో - రెడీ టూ ఈట్ స్నాక్స్.

అలాగే ఏపీలోని 13 జిల్లాల్లో కూడా సాగు చేయాల్సిన పంటలను కేంద్రం సూచించింది.

అనంతపురం జిల్లాలో పల్లి, చిత్తూరులో టమాట, ఈస్ట్ గోదావరిలో కొబ్బరి, గుంటూరులో మిర్చి, పసుపు, కడపలో అరటి, కృష్ణాలో మామిడి, కర్నూల్లో ఉల్లి, నెల్లూరులో సిట్రస్ (పుల్లని పండ్ల తోటలు), ప్రకాశంలో మిర్చి, పసుపు, శ్రీకాకుళం జీడిపప్పు, విశాఖపట్నం చెరుకు, విజయనగరం మామిడి, వెస్ట్ గోదావరి ఆక్వా (ఫిషరీస్ చెరువులు) సాగు చేయాలని కేంద్రం సూచించింది.

■

ఒకరిని అంచనావేయడం వల్ల వారెలాంటివారో తెలిసే కంటె నీవెలాంటివాడివో నీకు తెలుస్తుంది.

# తెలంగాణాలో 20 వేల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు !


## ప్రభుత్వంతో 'అవర్‌ఫుడ్' సంస్థ ఒప్పందం

**తె**లంగాణా రాష్ట్రవ్యాప్తంగా 20 వేల చిన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన అగ్రిటెక్ స్టార్టప్ 'అవర్ ఫుడ్' తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. వీటివల్ల డైరెక్టుగా 10 వేల మందికి, ఇన్‌డైరక్టుగా 60 వేల మందికి ఉపాధి దొరుకుతుంది. ఈ యూనిట్లు బియ్యం, పప్పు ధాన్యాలు, పల్లీలు, చిరు ధాన్యాలు, పసుపు, ఎండుమిరప వంటి పంటలను ప్రాసెస్ చేసి ఆహార పదార్థాలను తయారుచేస్తాయి. ఫుడ్ ప్రాసెసింగ్ మెషీన్లను జహీరాబాద్‌లోని తమ ప్లాంటులోనే తయారుచేస్తామని అవర్ ఫుడ్ తెలిపింది. పొలాలు, పంటచేన్ల సమీపంలోనే రైతులు / నిరుద్యోగయువకులు వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు.



అవర్ ఫుడ్ ప్రొడక్టులను ప్రదర్శిస్తున్న బాలారెడ్డి, జయేశ్ రంజన్

ఈసందర్భంగా రాష్ట్ర ఐటీ, ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు అన్నివిధాలా సహకరిస్తామని, త్వరలో ఐటీసీ కంపెనీ మనోహరాబాద్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. ఈ యూనిట్ల ద్వారా తయారయ్యే ఆహారపదార్థాల నాణ్యత ఎంతో బాగుంటుందని చెప్పారు. "మొత్తం 8 పంట ధాన్యాలు / కాయల నుంచి ఆహార పదార్థాలు తయారుచేస్తారు. వీటిని స్థానిక కిరాణా దుకాణాలకు, సూపర్ మార్కెట్లకు అమ్ముతారు.



తెలంగాణవ్యాప్తంగా పంట దిగుబడులు బాగా పెరిగాయి. రైతులు ధాన్యాన్ని నేరుగా అమ్మే బదులు ఫుడ్ ప్రాసెసింగ్ చేస్తే ఎక్కువ డబ్బు సంపాదించవచ్చు" అని వివరించారు. పరిశ్రమలశాఖ సీనియర్ ఆఫీసర్ సుష్మా ధరమ్‌సూత్ మాట్లాడుతూ మెషీన్లను కొనుక్కోవడానికి రైతులకు బ్యాంకులోన్లు ఇస్తారని, 35శాతం సబ్సిడీ కూడా పొంద వచ్చని అన్నారు. కొత్తగా మరో నాలుగు వేల యూనిట్లను ఏర్పాటు చేస్తామని అన్నారు. అవర్ ఫుడ్ సీఈఓ బాలారెడ్డి మాట్లాడుతూ "ప్లాంటు కోసం రూ. 15కోట్లు ఇన్వెస్ట్ చేశాం. మరో రెండు నెలల్లో మరో రూ. 150 కోట్ల పెట్టుబడిని సమీకరిస్తాం. ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేస్తే మేం వారికి యూనిట్లను నిర్మించి ఇస్తాం. వీటిద్వారా రైతులు / నిరుద్యోగులు నెలకు 20 వేల రూపాయలకు పైగా సంపాదించుకోవచ్చు. ఒక్కో యూనిట్ ఏర్పాటుకు ఏడు లక్షల రూపాయల వరకు ఖర్చవుతుంది. మేం మొత్తం 9 రాష్ట్రాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను అమ్ముతున్నాం. కొత్త ఆర్థిక సంవత్సరంలో 85 కోట్ల రూపాయల టర్నోవర్ సాధించాలని టార్గెట్‌గా పెట్టుకున్నాం" అని వివరించారు.

రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రభుత్వం ప్రాధాన్యాంశంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ దిశలో చొరవ తీసుకుంటే చిన్న రైతులకు, సొంత కాళ్లపై నిలబడాలనుకునేవారికి ఈ ఇండస్ట్రీలో మెరుగైన అవకాశాలుంటాయనేది అంచనా. అంతేకాకుండా ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ విస్తరణ వల్ల కొత్త ఉద్యోగాలు కూడా వస్తాయనేది ప్రభుత్వ ఆలోచన. ■

నీ భవిష్యత్తుకు రూపుదిద్దేది నీ నిర్ణయాలే సుమా !

# తెలుగింటి 'వన రాణి' రామలక్ష్మి !

## ఐఎఫ్ఎస్ అసోసియేషన్ విడుదల చేసిన 'గ్రీన్ క్వీన్స్' పుస్తకంలో ప్రముఖ స్థానం

**ఆం**ధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికైన తొలి మహిళ సీఎస్ రామలక్ష్మి సేవలను ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అసోసియేషన్ ప్రత్యేకంగా కొనియాడింది. 1980లో మొట్టమొదట ఈ రంగంలోకి ప్రవేశించిన ముగ్గురు మహిళల్లో రామలక్ష్మి ఒకరు. అప్పట్లో పురుషులకే పరిమితమైన వృత్తిలోకి ధైర్యంగా ముందడుగు వేయడమే కాకుండా... విధుల్లో సత్తా చాటారని ఇండియన్



ఫారెస్ట్ సర్వీస్ అసోసియేషన్ గుర్తు చేసింది. మహిళా దినోత్సవం సందర్భంగా ఆ ఉద్యోగినుల సేవలపై 'గ్రీన్ క్వీన్స్ ఆఫ్ ఇండియా... నేషన్స్ ప్రైడ్' పుస్తకం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ ప్రత్యేక ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సీఎస్ రామలక్ష్మి ఈ సర్వీసులోకి వచ్చిన విధానం, ఉద్యోగ జీవితంపై అందులో ఇలా ప్రస్తావించింది.

'రామలక్ష్మి గ్రామీణ ప్రాంతాల్లో అద్భుతంగా పని చేశారు. ఐఎఫ్ఎస్ పరీక్షలకు సరదాగా దరఖాస్తు చేసుకున్నా ఉద్యోగ జీవితంలో విజయవంతంగా రాణించారు. ఐఎఫ్ఎస్ అధికారిగా గుంటూరులో తొలుత పని చేసినా... కరీంనగర్ ఈస్ట్ డివిజన్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా తనదైన ముద్ర వేసుకున్నారు. నక్సల్ ప్రభావం ఎక్కువగా ఉన్న ఆ ప్రాంతంలో ఎలాంటి సదుపాయాలు లేకున్నా నెలలో 20 రోజులు రాత్రి పగలు విధులు నిర్వర్తించారు. ఆ సమయంలోనే అక్కడి పేదలకు ఇళ్ల నిర్మాణం, రేషన్ పంపిణీ, ఆదాయం కల్పించే పథకాలు అమలు చేసే అదనపు బాధ్యతలనూ చేపట్టారు. 1986లో గోదావరి నది ఆకస్మిక వరదలతో నష్టపోయిన వారికి సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపట్టగా ఏపీ ప్రభుత్వం ఉత్తమ సేవా పథకంతో సత్కరించింది. పదవీ విరమణ తర్వాత కూడా రామలక్ష్మి క్రియాశీలకంగా ఉన్నారు' అని పుస్తకంలో వివరించారు.

**తెలుగు 'గ్రీన్ క్వీన్స్' వీరే**

ఐఎఫ్ఎస్‌లోకి 1980 సంవత్సరంలో మహిళల ప్రవేశం మొదలైంది. ఇప్పటివరకు 284 మంది మహిళలు పని చేశారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 8 మంది, తెలంగాణ నుంచి 11 మంది మహిళలు ఉన్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ నుంచి సీఎస్ రామలక్ష్మి, ఎం.రేవతి, శాంతిప్రియ పాండే, జ్యోతి తుల్లిమెల్లి, యశోదా బాయ్, నందనీ సలారియా, సుమన్ బేనివాల్, నిషాకుమారి ఉన్నారు. తెలంగాణ నుంచి ఆర్. శోభ, సి.సువర్ణ, సునితా జేఎం భగవత్, అకోయ్‌జామ్ సోనిబాలా దేవి, ప్రియాంకా వర్గీష్, ఎస్‌జే ఆశా, ఎన్.క్షితిజ, శివానీ డోగ్రా, అర్పణా, భూక్యా లావణ్య, బోగా నిఖిత పేర్లను పుస్తకంలో పేర్కొన్నారు. ■



పరుషమైన మాటలే కాదు, పెదవి విప్పని మౌనం కూడా మనసును ముక్కలు చేయవచ్చు

# ఆరోగ్య వివరాలు లేవని బీమాను తిరస్కరించకూడదు

## తెలంగాణా రాష్ట్ర వినియోగదారుల కమిషన్ తీర్పు

**పా**లసీదారు ఆరోగ్య వివరాలన్నీ వెల్లడించలేదన్న ఏకైక కారణంతో బీమా పరిహారాన్ని తిరస్కరించకూడదని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ స్పష్టం చేసింది. అందులోనూ పాలసీదారు వెల్లడించని అనారోగ్య కారణంతో కాకుండా గుండెపోటుతో మృతి చెందినప్పుడు పాలసీ సొమ్మును తిరస్కరించడం చెల్లదంది.

వరంగల్ జిల్లాకు చెందిన సమ్మక్క 2013 ఫిబ్రవరి 4న రూ. 11,966 ప్రీమియాన్ని చెల్లించి ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో రూ. 1.57 లక్షలకు పాలసీ తీసుకున్నారు. అదే ఏడాది ఆగస్టు 29న చనిపోగా నామినీగా ఉన్న కుమారుడు ఆజ్మీరా సమ్మయ్య బీమా సొమ్ము కోసం సంస్థను ఆశ్రయించారు. అనారోగ్యాన్ని వెల్లడించకుండా పాలసీ తీసుకున్నందున తిరస్కరిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. దీనిపై సమ్మయ్య జిల్లా ఫోరంను ఆశ్రయించగా రూ. 1.57 లక్షలు 7.5 శాతం వడ్డీతో చెల్లించడమే కాకుండా 20వేలు ఖర్చులకు ఇవ్వాలని తీర్పు వెలువరించింది. దీనిపై బీమా కంపెనీ రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో అప్పీలు చేసింది.

కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ ఎమ్మెస్కే జైశ్వాల్, సభ్యురాలు మీనా రామనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పాలసీదారుకు డయాబెటిస్ ఉందని... ఇన్సులిన్ తీసుకుంటూ, ఆ విషయాన్ని దాచిపెట్టి పాలసీ తీసుకున్నందువల్ల క్లెయిమ్‌ను తిరస్కరించినట్లు తెలిపింది. “పాలసీ తీసుకోకముందు నెల నుంచే ఆమె ఇన్సులిన్ ఆపేశారు. అంతేగాకుండా డయాబెటిస్ వల్ల పాలసీదారు చనిపోలేదు. గుండెపోటు వల్ల చనిపోయిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. దీర్ఘకాలంగా డయాబెటిస్‌తో బాధపడుతున్నందువల్ల గుండెపోటు వచ్చిందనడానికి బీమా కంపెనీ ఎలాంటి ఆధారాలు సమర్పించలేదు” అంటూ కొట్టివేసింది. జిల్లా ఫోరం తీర్పు ప్రకారం పాలసీదారు కుమారుడికి రూ. 1.57 లక్షలను 7.5 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది.

**కారు మరమ్మతు ఖర్చులతో పాటు పరిహారం**

అకాల వర్షాలతో పాడైన కారు మరమ్మతు ఖర్చులతో పాటు పరిహారంగా రూ. 50 వేలు చెల్లించాలంటూ ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. కూకట్‌పల్లికి చెందిన బి.విశ్వనాథరెడ్డి బంజారాహిల్స్‌లోని టాటా మోటార్స్ నుంచి 2009లో కారు కొన్నారు. 2010లో అకాల వర్షాలతో ఇంజిన్‌లోకి నీరు వెళ్ళి పాడైంది. వర్క్‌షాపునకు తీసుకెళ్ళగా రూ. 1.07 లక్షలకు అంచనా వేసింది. క్లెయిమ్ చేయగా ఫిర్యాదుదారు నిర్లక్ష్యం అంటూ బీమా కంపెనీ తిరస్కరించింది.

ఆధారాలను పరిశీలించిన జిల్లా ఫోరం మరమ్మతు ఖర్చులతో పాటు రూ. 50 వేలు పరిహారంగా చెల్లించాలంటూ తీర్పు వెలువరించింది. దీనిపై ఇన్సూరెన్స్ కంపెనీ రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో అప్పీలు చేయగా కొట్టివేసింది. జిల్లా ఫోరం తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణాలు లేవని స్పష్టం చేసింది.

(ఈనాడు సౌజన్యంతో ...)

■

### ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్య పంటగా సోయాబీన్



ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ, ఆదిలాబాద్ గ్రామీణ మండలాల్లో సోయాబీన్ ముఖ్య పంటగా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ ఏర్పాటు చేయుటకు తీర్మానించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు.

■

తప్పు చేస్తానేమోననే కుశంక సృజనశీలతకు చేటు చేస్తుంది, ధైర్యంగా ముందడుగే దానికి మందు

# వితంతు, ఒంటరి మహిళలకు పింఛన్ ఆపవద్దు!

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీఓ152 ను రద్దుచేసిన హైకోర్టు

**ప**దవీ విరమణ చేసి మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో వితంతువు, విడాకులు తీసుకున్న కుమార్తెలకు ఇచ్చే ఫ్యామిలీ ఫింఛన్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షరతులు విధించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఈ క్రమంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో 152ను రద్దు చేసింది. పిటిషనర్లకు గతంలో ఇచ్చిన మాదిరిగానే ఫించను చెల్లించాలని ఆదేశించింది. పిటిషనర్లకు బకాయి ఉన్న పింఛన్‌ను 6% వడ్డీతో కలిపి రెండు నెలల్లో చెల్లించాలని స్పష్టం చేసింది.

ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టి స్ ఎం. సత్యనారాయణమూర్తి ఇటీవల తీర్పు ఇచ్చారు. ఫ్యామిలీ ఫించనుకు సంబంధించి 2019 నవంబరులో ప్రభుత్వం జీవో 152 ద్వారా కొన్ని షరతులు విధించింది. మరణించిన ఉద్యోగుల వితంతు, విడాకులు తీసుకున్న కుమార్తెకు 45 ఏళ్లు దాటినా, వారి పిల్లలకు 18 ఏళ్లు దాటినా ఫించను పొందేందుకు అనర్హులుగా పేర్కొంది. ఆ జీవోను సవాలు చేస్తూ కొందరు బాధితులు హైకోర్టును ఆశ్రయించారు.

దీనిపై జరిగిన విచారణ నేపథ్యంలో న్యాయమూర్తి మాట్లాడుతూ.. ''ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్-1980 నిబంధనల మేరకు ఫ్యామిలీ ఫించను పొందేందుకు ఎలాంటి నిబంధనలు విధించలేదు. ఒక జీవో జారీ చేయడం ద్వారా ఫించను అర్హతలు నిర్ణయించడం సరికాదు. కార్యనిర్వాహక అధికారాలు, చట్టబద్ధ నిబంధనలను అధిగమించలేవు. పింఛను మంజూరు ఏ ఒక్కరి విచక్షణాధికారం మీద ఆధారపడి ఉండదని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో స్పష్టం చేసింది. జీవనోపాధి హక్కు.. జీవించే హక్కులో భాగమని పేర్కొంది. పింఛను, కుటుంబ పింఛను అనేవి జీవించే హక్కులో భాగం. చట్టం ద్వారా కాకుండా ఏ ఇతర మార్గాల్లోనూ ఆ హక్కును తీసివేయడానికి వీల్లేదు. ఫ్యామిలీ పింఛను నిలుపుదల చేయడమంటే రాజ్యాంగం ప్రసాదించిన హక్కును హరించడమే, అధికరణ 14, 21, 300ఏలను ఉల్లంఘించడమే"

**సహజ న్యాయసూత్రాల పాటింపు ఏదీ?**

పింఛను నిలిపివేసే ముందు సహజ న్యాయసూత్రాలు పాటించలేదని, పిటిషనర్లకు నోటీసులు ఇచ్చి కనీసం వారి వివరణ తీసుకోలేదని న్యాయమూర్తి అన్నారు. జీవో 152 ప్రకారం 45 ఏళ్లు దాటినవారు ఫ్యామిలీ ఫించను పొందేందుకు అనర్హులుగా పేర్కొన్నారు. 45 ఏళ్లు దాటిన మహిళల్లో ఆరోగ్య సమస్యలు ఉండే అవకాశం ఎక్కువ. ఆడపిల్లలు ఉన్న వితంతువులు, విడాకులు తీసుకున్న మహిళలు ఆ ఆడబిడ్డలకు పెళ్లి చేసి అత్తారింటికి పంపించాల్సిన బాధ్యత ఉంటుంది. ఈ నేపథ్యంలో 45 ఏళ్లు దాటని, దాటిన వారి మధ్య వ్యత్యాసం చూపుతూ అర్హతల విషయంలో వివక్ష చూపడం సరికాదు. 2019 నవంబరులో జారీ చేసిన జీవో 152లోని అర్హతలు.... 2010 అక్టోబరు 7నుంచి వర్తిస్తాయనడం చట్ట విరుద్ధం. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు రాజ్యాంగ, చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉంటే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో స్పష్టం చేసింది'' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 152, ఏపీ పెన్షన్ రివైజ్డ్ రూల్స్‌ను ఉల్లంఘిస్తోందని తెలిపారు.

**కనీసం పింఛను పెంచలేం: కేంద్రం స్పష్టీకరణ**

ఉద్యోగుల పింఛను పథకం (ఈపీఎస్ – 95) కింద నెలవారీ ఇచ్చే కనీస పింఛను మొత్తాన్ని పెంచలేమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆర్థికభారంపై రాజీ పడకుండా లేదా అదనంగా బడ్జెట్‌లో ఆర్థిక సాయం చేయకుండా పింఛను పెంపు అసాధ్యమని స్పష్టం చేసింది. కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్ గాంగ్వార్ ఈమేరకు లోక్‌సభలో ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ...)

■

ఇతర ప్రాణులను ప్రేమించలేనంతకాలం నీ గుండెలోని ఒక అర బండబారినట్టే

# ఒడిశాలో ఫలిస్తున్న ఎఫ్ పి సి ప్రయోగం !

**ఒ**డిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాలోని దస్మంత్‌పూర్ బ్లాక్‌లో చాలాకాలంగా వరి, చిరుధాన్యాలు, మొక్కజొన్న, గడ్డి నువ్వులు పంటలను సాగు చేయడం సంప్రదాయంగా సాగుతున్నది. మరీ ముఖ్యంగా ఖరీఫ్ పంటకాలంలో నీటి సాగు ఎక్కువగా ఉంటుంది. ఎత్తుపల్లాలతో ఉండే పొలాలు, వాటిలో భూసారం చాలా తక్కువ. సరైన సాగునీటి సదుపాయాలు ఉండవు. ఫలితంగా ఏడాది కాలంలో ఒక్క పంట సాగు చేస్తే అది గొప్ప. అదీ అక్కడి రైతన్నల దుస్థితి. సేంద్రీయ సాగు పద్ధతులపై వారికి సరైన అవగాహన కల్పించేవారు లేరు. కేవలం సంప్రదాయంగా వాడుకలో



ఉన్న విధానాలనే అనుసరించి సాగు చేస్తున్న కష్టజీవులు వారు. వారి కష్టానికి తగిన దిగుబడి వచ్చేది కాదు. తక్కువ దిగుబడులు వస్తున్న కారణంగా బేరసారాల్లో వారు ఎప్పుడూ నిలబడలేక మోసపోతూనే ఉండేవారు. ఫలితంగా వారికి అందే రాబడి కూడా చాలా తక్కువ. చేతికి అందిన కొద్దిపాటి ఆదాయంతో బతకలేక మెరుగైన ప్రత్యామ్నాయ ఉపాధులను వెతుక్కుంటూ దూరప్రాంతాలకు వలస పోవడం వారికి తప్పనిసరిగా మారింది.

ఆ పరిస్థితులలో అగ్రగామి అనే స్వచ్ఛంద సంస్థ వారికి ఎదురవుతున్న సవాళ్ళను ఎదుర్కోవడంలో చేయూత నిచ్చేందుకు ముందుకు వచ్చింది. వారి జీవనోపాధిని వారు నివసించే ప్రాంతాలలోనే మెరుగైన రూపంలో సమకూర్చేందుకు నడుం బిగించింది. అందుకోసం రైతులను సంఘటితం చేసి ఉత్పత్తిదారులైన రైతులనే భాగస్వాములుగా చేసేందుకు చొరవ తీసుకుంది. నిధులు అందించే కేకేఎస్, నాబార్డ్ సంస్థలతో పాటు ఒడిశా ప్రభుత్వ సహకారంతో అగ్రగామి సంస్థ సుస్థిరమైన జీవనోపాధులను సమకూర్చేం దుకు ఒక కార్యక్రమం చేపట్టింది. గడచిన పదేండ్ల కాలంలో కోరాపుట్ జిల్లాలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన 4500 రైతు కుటుంబాలను, మహిళా రైతులను పర్యావరణ అనుకూల సేద్యం చేపట్టేలా ప్రోత్సహించగలిగింది.

**ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ**

దస్మాన్‌పూర్ జీడిపప్పు అభివృద్ధి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ అనేది అగ్రగామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అందులో రైతులు, మహిళా మండలి సభ్యులు భాగస్థులయ్యారు. రైతులకు గిట్టుబాటు ధరలను సంపాదించే కృషిలో ఈవిధంగా 87 గ్రామాలకు చెందిన వీరంతా చేతులు కలిపారు.

ఆర్థికంగానూ, సామాజికంగానూ వెనుకబడిన రైతులను, మహిళలను ఈ కంపెనీ సంఘటితం చేసింది. వారిలో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఆలోచన రేకెత్తిం చింది. వారి శక్తియుక్తుల్ని సరైన మార్గంలో నడిపించి వారిని లాభార్జన దిశగా నడిపించింది. ఈ కంపెనీ 2016 మే లో ఏర్పాటైంది. అందులో 2050 మంది అభివృద్ధి ఆశించే రైతులు సభ్యత్వం తీసుకున్నారు. వారంతా 87 రైతు ఉత్పత్తిదారుల గ్రూపులకు చెందినవారు. (వాటిలో 37 / దయన్ వికాస్ సమితి విభాగాలు కాగా 50 మహిళా మండలులు)

ఇప్పుడు ఉదయన్ వికాస్ సమితి రూపంలోనూ, మహిళా మండలి రూపంలోనూ ఉన్న సభ్యులందరూ కూడా 2009–2011 మధ్య గ్రామస్థాయి గ్రూపులుగా ఏర్పడ్డారు. వారు తమ పొదుపు మొత్తాలను జమచేసి, అవసరమైన సభ్యులకు రుణాలు ఇస్తూ పరస్పరం సహాయం అందించుకునే వారు. క్రమంగా వారంతా తోటల పెంపకం, పంటల సాగు

పనులు చేపట్టడం మొదలుపెట్టారు. జీడిపప్పు, పసుపు, నూనె గింజలు, పప్పుధాన్యాలు, మామిడితోటలు, కర్ర పెండలం, కొండ చీపుళ్ళు ఇంకా చిరుధాన్యాలు సాగు చేయడం ప్రారంభించారు.

ఈ కంపెనీ ప్రధాన లక్ష్యం ఏమిటంటే ఉత్పత్తిని అధికం చేయడం.అందులో భాగంగా ఉత్తమ పద్ధతులను తోటల పెంపకందారులు అనుసరించేలా ప్రోత్సహించడం. డిసెంబర్2017నాటికి 1850కుటుంబాలు 2115ఎకరాల్లో సేంద్రీయ సేద్యం ప్రారంభించాయి. ఉత్పత్తి దాదాపు 5 నుంచి 10 శాతం అధికంగా లభించడం ప్రారంభమైంది.

అంటుకట్టిన నారుమొక్కల వాడకాన్ని, పిట్ కంపోస్టు, వెర్మి కంపోస్టు, ఆకు అలములతో తయారుచేసిన సేంద్రీయ ఎరువులను ఉపయోగించడాన్ని ప్రోత్సహించారు. అంతే కాకుండా ఆకు అలములను కప్పడం, గుండ్రంగా ఉండే రింగుల రూపంలో ఎరువుల తయారీ, పిచ్చర్ ఇరిగేషన్‌వంటి విధానాలను అనుసరించేలా చూశారు. వీటి విషయం లో అవసరమైన శిక్షణ ఇవ్వడమే కాకుండా వాటి ఉపయోగా లను ప్రదర్శనల రూపంలో చూపించారు. వాటిని అమలు చేస్తున్న ఇతర ప్రాంతాల క్షేత్రాలను వారిని తీసుకెళ్ళి అనుభవంతో పాటు అవగాహన కలిగించారు. ఫలితంగా 56 గ్రామాలలోని 1275 మంది రైతులు తమ పొలాల్లో జీడి తోటలను పెంచడం మొదలుపెట్టారు. ఒక్కో చెట్టు నుంచి వారికి 5నుంచి 7 కిలోల వరకు దిగుబడి లభించింది. ఇదేవిధంగా 53 గ్రామాలకు చెందిన 1109 మంది రైతులు మామిడి తోటలు పెంచారు. వారికి ఒక్కో చెట్టు నుంచి 12 కిలోల వరకు దిగుబడి వచ్చింది. ఇన్‌పుట్ సరఫరా చేసే సేంద్రీయ పద్ధతుల్లో పండించిన మామిడి కాయలు కొనుగోలు చేస్తారు. ఒడిశా రాష్ట్ర జీడిపప్పు అభివృద్ధి సంస్థ ఆగ్రో సర్వీస్ సెంటర్, ఉత్కళ్ విత్తనాలు, నర్సరీ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతోంది.

కొండచీపురు పెంపకంను 58 గ్రామాలకు చెందిన 1250 మంది రైతులు చేపడుతున్నారు. గతంలో ఆక్రమిత భూములపై వీటిని పెంచేవారు. ఇప్పుడు దీనిని సొంత భూముల్లోనూ, ఉమ్మడి భూముల్లోనూ కూడా ఒక క్రమ



పద్ధతిలో సాగు చేస్తున్నారు. మెళుకువలు ఇప్పుడు నేర్చు కున్నారు. మేలైన పద్ధతులు అనుసరిస్తున్నారు. ప్రాసెసింగ్ సదుపాయాలు, చీపుళ్ళకు మరింత విలువ కలిగించే విధానాలు తెలుసుకున్నారు. ఫలితంగా ఎకరా భూమిలో 400 నుంచి 450 కిలోలు పెంచడం సాధ్యమవుతోంది.

ఇదేవిధంగా పసుపు సాగును 6 గ్రామాలకు చెందిన 79 మంది రైతులు చేపట్టారు. ప్రాసెసింగ్, అదనపు విలువలను సమకూర్చేందుకు వీరు ఎలాంటి సమష్టి కృషి చేసేవారు కాదు. అందుకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన లేకపోవడం ముఖ్యమైన కారణం. దిగుబడి ఎకరాకు 10000 నుంచి 12000 కిలోల వరకు ఉండేది. ఇప్పుడు 32 గ్రామాలకు చెందిన 407 మంది రైతులు పసుపు సాగులోకి వచ్చారు. వారు అనుసరించిన ఉత్తమ పద్ధతుల కారణంగా దిగుబడి 18000 నుంచి 22000 కిలోల వరకు ఎకరాకు వస్తోంది. సేకరణ, ప్రాసెసింగ్, విలువల చేర్పు ఇప్పుడు వారికి అందుబాటుకు వచ్చింది.

**అదనపు విలువలు - మార్కెటింగ్**

ప్రాసెసింగ్ విధానాలపైనా, విలువ పెంపు విధానాల పైనా పూర్తి శిక్షణ పొందిన ఈ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఇప్పుడు వాటిని అమలు చేసి తమ ఉత్పత్తులను మరింత విలువలను సమకూర్చడంలో విజయం సాధించగలుగు తున్నాయి. వరి ఉత్పత్తులకు స్థానికంగా ప్రత్యేకమైన గుర్తింపు సాధించేందుకు బ్రాండ్ రూపకల్పన కూడా చేశారు. మామిడి, జీడిపప్పు వంటి వాటికి విలువను పెంచే ప్రయత్నాలను ఈ కంపెనీకి అనుబంధంగా ఉండే వ్యాపార బృందాలు చేపట్టాయి. మహిళా మండలి సభ్యులు కొండచీపుళ్ళు, పసుపు ఉత్పాదనలకు విలువలు తెచ్చేందుకు

కృషి చేస్తున్నాయి.

ఈరకంగా రైతన్నలు ఏర్పాటు చేసుకున్న ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీలో గతంలో పని చేసిన సభ్యులు ఉత్పత్తులను సేకరించి మార్కెట్‌కు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వారు ఈ ఉత్పాదనలను స్థానికంగా ఉండే మార్కెట్లకు మాత్రమే కాకుండా సిటీలలోని మార్కెట్‌కు కూడా వాటిని చేరవేస్తున్నారు. సేకరణ విషయంలో అగ్రగామి సహకారం అందిస్తోంది. సేకరణ నేర్పును వారికి కలిగించేందుకు కంపెనీ బోర్డు డైరక్టర్లకు అగ్రగామి ప్రత్యేకంగా శిక్షణ అందిస్తోంది. నిష్పాక్షికంగా నాణ్యతను కాపాడేందుకు తోడ్పడుతోంది. ఈ శిక్షణలో మార్కెట్ విధివిధానాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా వారికి మెళకువలు నేర్పుతున్నది. మధ్యదళారుల వ్యవస్థను దూరంగా ఉంచడం వల్ల రైతులకు సముచితమైన గిట్టుబాటు ధర లభిస్తోంది. ప్రత్యేకంగా దస్మాన్‌పూర్‌లో ఒక విక్రయ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ పూర్తిగా అదనపు విలువలు సమకూర్చిన ప్రాసెస్ చేసిన వస్తువులనే వినియోగదారులకు అందిస్తున్నారు. 201 చివరినాటికి 255 టన్నుల జీడిపప్పు, 145 టన్నుల మామిడి, 41 టన్ను కొండ చీపుళ్ళు విక్రయించగలిగారు. పండించిన రైతు లేదా కంపెనీలో భాగస్వామి ఒక్కొక్కరు రూ. 53,840 ఆదాయం సంపాదించగలిగారు. ఇదేవిధంగా ఒడిశా రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, మార్కెటింగ్ సొసైటీతోను, పీసీఎం ఎక్స్‌పోర్ట్ సంస్థతోను ఒప్పందాలు కుదుర్చుకోగలిగారు. అందువల్ల రైతులకు మరో 40 శాతం అధికంగా ఆదాయం సమకూరింది. ఉదాహరణకు మధ్యవర్తులకు ముడి పసుపు కొమ్ములు విక్రయించడం వల్ల దస్మన్‌పూర్ బ్లాక్‌లోని మరీచగూడ రైతులు క్వింటాలుకు కేవలం రూ. 8000 మాత్రమే సంపాదించగలిగేవారు. పసుపు పంటకు అదనపు విలువ సమకూర్చి నేరుగా మార్కెట్‌కి తీసుకెళ్ళి విక్రయిస్తున్న కారణంగా వారికి క్వింటాలు పసుపు పొడికి రూ. 1,50,000 లభిస్తోంది. ఇదేవిధంగా జీడిపప్పు, మామిడి, కొండచీపుళ్ళ విషయంలో కూడా రైతులకు అదనంగా 40 శాతం ఆదాయం లభిస్తోంది.

మార్కెట్ అనుసంధానంతో పాటు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీలు సీజన్‌ల వారీగా రైతుల మేలాలను నిర్వహిస్తున్నారు. ఈ మేలా సందర్భంగా రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్ముకోగలుగుతున్నారు. ఆరకంగా తమ ఉత్పత్తులకు ప్రత్యక్షంగా గిరాకీ సంపాదించుకుంటున్నారు. మార్కెటింగ్ సహాయమే కాకుండా ఈ కంపెనీ అత్యవసర సమయాల్లో రుణ రూపంలో సహాయం, వినిమయ వస్తువులకు, ఇంకా ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి రిటైల్ సేవలు రైతులకు అందిస్తోంది.

వ్యవసాయ పనిముట్లు సమీకరించడంలోనూ, ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశాలు పెంచుకోవడంలో ఉమ్మడిగా కృషి చేయడం ద్వారా రైతులకు అధిక ఆదాయం సాధ్యమైంది. అంతేగాక వారు మరింత గిట్టుబాటు ధర కోసం బేరమాడగలిగే శక్తిని సమకూర్చుకోగలిగారు. సేకరణలో అనుసరించిన ఈ విధానం స్థానికంగా రైతులకు లభించే మద్దతు మరింత పెరిగింది. తోటి రైతులు మాత్రమే కాకుండా పాలనా యంత్రాంగం నుంచి కూడా వారికి మరింత మద్దతు అందుతోంది.

అయినా కూడా కొన్ని సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. కంపెనీ రూపంలో సంఘటితం చేయడంలో స్వచ్ఛంద సంస్థ కృషి ప్రోత్సాహకరంగానే ఉన్నప్పటికీ, ఆ బాధ్యతను కేవలం సామాజిక బాధ్యతగా మాత్రమే అవి నిర్వహిస్తున్నాయి. మార్కెట్‌ను అవగాహన చేసుకోవడం, రైతులకు పారిశ్రామిక నిర్వహణ సామర్థ్యం పెంపొందించడంలో అవి ఆశించిన స్థాయిలో పని చేయలేకపోతున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో తప్పనిసరిగా ఇది చాలా అవసరం. అది వాటికి సాధ్యం కావడం లేదు. ఇటువంటి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ పటిష్టంగా రూపుదిద్దుకోవాలంటే అందుకు అనుకూలమైన వాతావరణం కూడా ఉండాలి. ఎందుకంటే ఇది వ్యవసాయ సంబంధిత విలువపెంపు కృషికి సంబంధించిన అంశం. ఇది రైతు వ్యవసాయ క్షేత్రంలో ప్రారంభమై ఎక్కడో ఉన్న మార్కెట్‌లో ముగిసేవరకు సాగే ప్రయాణంలో ఇది ఇంకా తొలి అడుగు మాత్రమే. ■

వెలుగులో వెలిగేవారు చీకటిలో కనుమరుగవుతారు, వ్యక్తిత్వపు వెలుగు వుంటే చీకటి వెలవెలపోతుంది

# అతివృష్టి నుంచి ఎత్తు మడులతో పంటలకు రక్షణ!

**భా**రీ వర్షాల్లో కూడా పత్తి చేలు ఉరకెత్తకుండా ఉండే ఉపాయం ఏమైనా ఉందా? ఉందంటున్నారు ఆదిలాబాద్ కేవీకే శాస్త్రవేత్తలు. ఎత్తు మడుల (రెయిజ్డ్ బెడ్స్)పై పత్తిని విత్తుకుంటే అతివృష్టిని మాత్రమే కాదు, ఒకవేళ అనావృష్టి ఎదురైనా పంట సమర్థవంతంగా తట్టుకోగలుగుతుందని అంటున్నారు. పసుపు మాదిరిగా పత్తి, కంది, మిర్చి, వంగ తదితర కూరగాయలను సైతం ఎత్తు మడలపై సాగు చేస్తే.. వర్షాలు అటూ ఇటూ అయినా సరే 10-20% మేరకు దిగుబడి పెరుగుతుందంటున్నారు.



ఆరుగాలం కష్టపడి పంటలను సాగు చేస్తున్న అన్నదాతలు ఏదోవిధంగా నష్టపోతూనే ఉన్నారు. ఓ యేడాది అతివృష్టి, మరో ఏడాది అనావృష్టితో పంటలు దెబ్బ తింటు న్నాయి. అధిక వర్షం కురిసినప్పుడు నల్లరేగడి నేలల్లో బురదగా మారి పత్తిపంటలో ఎదుగుదల లోపించి దిగుబడిని దెబ్బతీస్తున్నాయి. దీంతో ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు నూతన విధానానికి శ్రీకారం చుట్టారు.

ఎత్తు మడుల పద్ధతి (రైజ్డ్ బెడ్ సిస్టమ్) ద్వారా కేవీకే క్షేత్రంలో వర్షాధారంగా బీటీ పత్తి సాగు చేస్తున్నారు. వర్షాధారపు సాగులో ఆదిలాబాద్ ప్రాంతంలో సాధారణంగా ఎకరానికి 8-10 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. అయితే, ఎత్తుమడుల పద్ధతిలో ఎకరానికి 13-15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంటున్నారు.

**15-20 సెం.మీ. ఎత్తున మడులు**

సమతల భూమి మీద గొర్రుతో తోలి సాళ్లుగా పత్తి విత్తుకోవడం సాధారణ పద్ధతి. ఎత్తు మడుల పద్ధతిలో ట్రాక్టర్‌కు రెయిజ్‌డ్ బెడ్ మేకర్ అనే పరికరాన్ని జోడించడం ద్వారా మడులు తోలుకొని పత్తి విత్తుకోవాలి. ఈ మడి 15-20 సెం.మీ. ఎత్తున ఉంటుంది. మడి వెడల్పు (ఆ భూమి స్వభావాన్ని బట్టి, అక్కడి వర్షపాతాన్ని బట్టి) ఎంత కావాలంటే అంత పెట్టుకోవచ్చు. మడి పైనే పత్తి విత్తనాలు నాటుతారు. పత్తి మొక్కలున్న ఎత్తు మడికి అటు ఇటు కాలువలు ఉంటాయి.

వర్షాలు కురిసినప్పుడు పంట చేలల్లో వర్షపు నీరు ఈ కాల్వల్లో మాత్రమే నిల్వ ఉండి భూమిలోకి ఇంకుతుంది. వర్షాలు ఈ ఏడాది మాదిరిగా బాగా ఎక్కువగా కురిస్తే... పత్తి మొక్కలు ఎత్తు మడిలో ఉంటాయి కాబట్టి ఉరకెత్తే ఇబ్బంది ఉండదు. మొక్కల వద్ద నీరు నిల్వ లేక పోవడంతో అవి ఏపుగా పెరుగుతాయి. గాలి సరిగా ఆడుతుంది. ఎండ బాగా తగులుతుంది. తెగుళ్లు కూడా అంతగా ఆశించవని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వర్షాలు అంతగా లేనప్పుడు కూడా ఎత్తు మడి ఉపయోగ పడుతుంది. వర్షానికి కాలువల్లో ఇంకిన నీటి తేమ ఉపయోగపడుతుంది.

**రెండేళ్లుగా ప్రయోగాలు**

కేవీకే సమన్వయకర్త డా. ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో రైజ్డ్ బెడ్ సాగు పద్ధతికి గత ఏడాది శ్రీకారం చుట్టారు. గతేడాది కేవీకేలో ఈ పద్ధతిలో ఎకరంలో పత్తి సాగు చేస్తే 12.5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 5 ఎకరాల్లో వేశారు. మొక్కల సాళ్ల మధ్య 180“30 సెం.మీ., 150“20 సెం.మీ., 120“30 సెం.మీ.ల దూరంలో ప్రయోగాత్మకంగా

ఈ ఏడాది పత్తి పంటను సాగు చేస్తున్నారు. పత్తి పంట ఐదున్నర అడుగుల ఎత్తు వరకు ఏపుగా పెరిగింది. ఒక్కో మొక్కకు ప్రస్తుతం 50 కాయలున్నాయి. మరో 30 నుంచి 40 కాయలు కాచే విధంగా పూత ఉంది. పురుగులు, తెగుళ్లు లేవు. సాళ్ల మధ్య తగినంత ఖాళీ ఉండటంతో కలుపు నిర్మూలనకు మినీ ట్రాక్టర్‌తో పైపాటు చేస్తున్నారు. కాయలు కాసిన తర్వాత పొలంలో నీరు నిల్వ ఉంటే కాయలు మురిగిపోయే అవకాశాలు ఉంటాయి. ఒకవేళ తగినంత వర్షం కురవకపోయినా, వర్షానికి వర్షానికి మధ్య ఎక్కువ రోజులు ఎడం వచ్చినా పంట బెట్టకు వచ్చి దిగుబడి తగ్గుతుంది. ఎత్తు మడుల పద్ధతి ద్వారా పంటలను సాగు చేయటం ఒక్కటే ఈ సమస్యలకు పరిష్కారం అని కేవీకే సమన్వయకర్త డా. ప్రవీణ్‌కుమార్ రైతులకు సూచిస్తున్నారు.

**వర్షాలు అటూఇటూ అయినా అధిక దిగుబడి!**

వర్షాధార భూముల్లో ఎత్తు మడులపై పంటలను సాగు చేయటం ద్వారా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను సమర్థవంతంగా తట్టుకోవచ్చు. వర్షాలు ఎక్కువైతే మడుల పక్కన కాలువల్లోంచి నీరు బయటకు వెళ్లిపోతుంది. పంట ఉరకెత్తదు. వర్షాలు తక్కువగా కురిసినా.. ఎక్కడి నీరు అక్కడే ఇంకుతుంది కాబట్టి భూమిలో తేమ ఉండి పంట దిగుబడి దెబ్బతినదు. అంటే.. వర్షాలు అటూ ఇటూ అయినా ఎత్తుమడుల వల్ల దిగుబడి దెబ్బ తినదు. 10-20% అదనంగా దిగుబడి పొందవచ్చు.

పసుపు మాదిరిగా పత్తిని కూగా ఎత్తు మడుల్లో సాగు చేయవచ్చు. కంది, మిరప, వంగ వంటి కూరగాయలుకూడా ఇలా సాగు చేయవచ్చు. ట్రాక్టర్‌తో ఎత్తుమడులు తోలుకోవాలి. ఎర్ర నేలల్లో అయినా, నల్ల నేలల్లో అయినా సాగు చేయొచ్చు. తేలికపాటి, ఎర్ర నేలల్లో సాళ్ల మధ్య, మొక్కల మధ్య దూరం తక్కువగా పెట్టుకోవాలి. బలమైన నల్ల నేలల్లో అయితే కొంచెం ఎడంగా పెట్టుకోవాలి. ఎర్ర నేలల్లో మొక్కల సాంద్రత ఎక్కువగా, నల్లనేలల్లో తక్కువగా ఉంటుంది.

మొదటిసారి గత ఏడాది నల్ల నేలలో 120“30 సెం.మీ. (సాళ్ల మధ్య 120 సెం.మీ., మొక్కల మధ్య 30 సెం.మీ.) దూరంలో సాగు చేశాం. బాగా వత్తుగా అయ్యి పురుగు మందుల పిరికారీ ఇబ్బంది అయ్యింది. ఈ ఏడాది 150“30, 180“30 కొలతల్లో పత్తి విత్తాం. 180“30లో ఎకరానికి 7,400 మొక్కలు వచ్చాయి. మొక్కలు ఆరు అడుగులు ఎత్తు పెరిగాయి. సాళ్లు కూడా మూసుకుపోయాయి. ఈ ఏడాది ఎడతెరపి లేని వర్షాల్లో కూడా నీరు నిలవలేదు. పంట ఉరకెత్తలేదు. చీడపీడల్లేవు. చెట్టుకు 40-50 కాయలున్నాయి. ప్రస్తుతం ఉన్న పూతతో మరో 30 వరకు కాయలు వరకు వచ్చే అవకాశం ఉంది. ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి ఖాయంగా వస్తుంది. రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నేల స్వభావాన్ని బట్టి, కలుపు గొర్రుతో తీస్తారా, ట్రాక్టర్‌తో తీస్తారా అన్నదాన్ని బట్టి రైతులు సాళ్ల మధ్య దూరాన్ని ఎంపిక చేసుకోవాలి.

– డా. యాదగిరి ప్రవీణ్‌కుమార్ (99896 23829), సమన్వయకర్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్

**మట్టికి దగ్గరైతే మది తేలిక!**

కోవిడ్-19 కష్టకాలంలో స్వయంగా మట్టిలో విత్తనాలు వేసి సేంద్రియ ఇంటి పంటలు సాగు చేయటం ప్రారంభించిన వారి మానసిక ఆరోగ్యం చాలా మెరుగు పడిందని అమెరికాలో జరిగిన ఓ అధ్యయనంలో తేలింది. ఇంటిపట్టున కూరగాయలు సాగు చేసుకునే వారికి శారీరక వ్యాయామం, ఆరోగ్యదాయకమైన కూరగాయలకు తోడు మానసిక స్వస్థత కూడా అభిస్తోందని ప్రిన్సెటన్ విశ్వ విద్యాలయం కరోనా కాలంలో చేపట్టిన సర్వేలో వెల్లడైంది.

'ప్రకృతిలో, మొక్కల మధ్య గడుపుతూ పెంచిన కూరగాయలను ఇరుగు పొరుగు వారితో పంచుకుంటూ ఉన్నప్పుడు వారి మదిలో స్థిమితత్వ భావన, గొప్ప సంతృప్తి, ఆనందం కలుగుతాయ'ని రొడేల్ ఇన్‌స్టిట్యూట్ కమ్యూనికేషన్స్ సంచాలకులు దయానా మార్టిన్ అన్నారు. కరోనా కాలంలో చాలా మంది ఉచిత కిచెన్ గార్డెన్ కిట్ తమ దగ్గర తీసుకొని కూరగాయల సాగు మొదలు పెట్టారన్నారు.

(సాక్షి సౌజన్యంతో ...)

■

**తలిదండ్రులు తమ పిల్లలకోసం ఏమేమో చేస్తారు, ఒక్కటి తప్ప ; అదే వారిని వారిగా ఎదగనివ్వడం**

# మజ్జిగ పానీయాలతో వేసవిని గెలవండి !

**“మం**చుకొండల్లో పాలు తోడుకోవు. అందుకని, అక్కడ పెరుగుగానీ, దాన్ని చిలికిన మజ్జిగ గానీ దొరికే అవకాశాలు ఉండవు. ఈ కారణంగా, కైలాసంలో ఉండే పరమశివుడికి, మజ్జిగ తాగే అలవాటు లేకపోవటాన ఆయన నీలకంఠు డయ్యాడు. పాల సముద్రంలో నివసించే విష్ణుమూర్తికి మజ్జిగ ఎటుతిరిగీ దొరకవు కాబట్టే, ఆయన నల్లని వాడయ్యాడు. స్వర్గంలో ‘సుర’ తప్ప మజ్జిగ దొరకవు కాబట్టి, ఇంద్రుడు బలహీనుడయ్యాడు. మజ్జిగతాగే అలవాటే గనక ఉంటే, చంద్రుడుకి క్షయ వ్యాధి, వినాయకుడికి పెద్ద పొట్ట, కుబేరుడికి కుష్టురోగం, అగ్నికి కాల్చే గుణం ఇవన్నీ వచ్చేవే కాదు” యోగరత్నాకరం అనే వైద్య గ్రంథంలో ఈ చమత్కార విశ్లేషణ కనిపిస్తుంది. మజ్జిగ తాగేవాడికి ఏ వ్యాధులూ కలగవనీ, వచ్చిన వ్యాధులు తగ్గి, తిరిగి తలెత్తకుండా ఉంటాయనీ, “విషదోషాలు”, “దుర్బలత్వం”, “చర్మరోగాలు”, “క్షయ”, ‘‘కొవ్వు’’, ‘‘అమిత వేడి’’ తగ్గిపోతాయనీ, శరీరానికి మంచి వర్చస్సు కలుగుతుందనీ దీని భావం. అక్కడ దేవతల కోసం అమృతాన్నీ, ఇక్కడ మానవుల కోసం మజ్జిగనీ భగవంతుడు సృష్టించాడట!



వేసవి కాలాన్ని మనం మజ్జిగతోనే ఎక్కువగా గడిపేం దుకు ప్రయత్నించాలి. తోడు పెట్టినందువలన పాలలో ఉండే పోషకవిలువలన్నీ మజ్జిగలోనూ పదిలంగా ఉండటం తో పాటు, అదనంగా “లాక్టో బాసిల్లై” అనే ‘మంచి బాక్టీరియా’ మనకు దొరుకుతుంది. పాలలో ఈ ఉపయోగకారక బాక్టీరియా ఉండదు. అందుకని, వయసు పెరుగుతున్నకొద్దీ మజ్జిగ అవసరం పెరుగుతుంది. ఫ్రిజ్జ్‌లో పెడితే మజ్జిగలోని ఈ బాక్టీరియా నిరర్థకం అవుతుంది. అందుకని అతి చల్లని మజ్జిగ తాగకూడదు. చిలికినందువలన మజ్జిగకు తేలికగా అరిగే గుణం వస్తుంది కాబట్టి పెరుగుకన్నా మజ్జిగ మంచిది.

**వేసవి కోసం ప్రత్యేకం “కూర్చిక పానీయం”:**

ఒక గ్లాసు పాలు తీసుకొని, కాచి చల్లార్చి అందులో రెండుగ్లాసుల పుల్లని మజ్జిగ కలపండి. ఈ పానీయాన్ని ‘కూర్చిక’ అంటారు. ఇందులో “పంచదార” గానీ, “ఉప్పు” గానీ కలపకుండానే తాగవచ్చు. “ధనియాలు”, “జీలకర్ర”, “శొంఠి” ఈ మూడింటినీ 100 గ్రాముల చొప్పున దేనికదే మెత్తగా దంచి, మూడింటినీ కలిపి తగినంత “ఉప్పు” కూడా చేర్చి, దాన్ని ఒక సీసాలో భద్రపరచుకోండి. “కూర్చిక”ను తాగినప్పుడల్లా, అందులో దీన్ని ఒక చెంచా మోతాదులో కలిపి తాగండి. వడదెబ్బ కొట్టదు. పేగులకు బలాన్నిసుంది. జీర్ణకోశ వ్యాధులన్నింటికీ ఇది మేలు చేస్తుంది. వేసవిలో కలిగే జలుబుని నివారిస్తుంది.

**వడదెబ్బ కొట్టని పానీయం “రసాల”:**

పెరుగు మీద తేరుకున్న నీళ్ళు, పాలు కలగలిపి ఆరోగ్యకరమైన “రసాల” అనే పానీయాన్ని “భీముడు” తయారు చేశాడని ‘‘భావప్రకాశ’’ వైద్య గ్రంథంలో ఉంది. అరణ్యవాసంలో ఉన్నప్పుడు, పాండవుల దగ్గరకు శ్రీ కృష్ణుడు వస్తే, భీముడు స్వయంగా దీన్ని తయారుచేసి వడ్డించాడట! ఇది దప్పికని పోగొట్టి వడదెబ్బ తగలకుండా చేస్తుంది కాబట్టి, ఎండలో తిరిగి ఇంటికి వచ్చిన వారికి ఇచ్చే పానీయం ఇది. తన ఆశ్రమాన్ని సందర్శించటానికి శ్రీరాముడు వచ్చినప్పుడు భరద్వాజ మహర్షి రాముని గౌరవార్థం ఇచ్చిన విందులో రసాల కూడా ఉంది. భావ ప్రకాశ వైద్య గ్రంథంలో దీన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరంగా ఇచ్చారు:

1. బాగా కడిగిన ఒక చిన్న కుండ లేదా ముంత తీసుకోండి. దాని మూతిని మూస్తూ ఒక పలుచని వస్త్రాన్ని రెండుమూడు పొరల మీద వాసెన (ఆవిరిపోక

యెసటికుండ మూతిమూసి కట్టిన గుడ్డ) కట్టండి. ఒక కప్పు పలుచని పెరుగులో అరకప్పు "పంచదార" కలిపి, ఈ మిశ్రమాన్ని "చల్లకవ్వం"తో బాగా చిలికి ఆ వాసెన మీద పోసి వడకట్టండి.

2. పెరుగులో పంచదార కరిగి నీరై ఆ వస్త్రంలోంచి క్రింది ముంతలోకి దిగిపోతాయి. వాసెనమీద పొడిగా పెరుగు ముద్ద మిగిలి ఉంటుంది. దాన్ని అన్నంలో పెరుగు లాగా వాడుకోండి. ఈ రసాలకు దానితో పని లేదు. ముంతలో మిగిలిన తియ్యని పెరుగు నీటిని 'ద్రప్యం' అంటారు. ఈ 'ద్రప్యం' నిండా లాక్టోబాసిల్లస్ అనే ఉపకారక సూక్ష్మజీవులు ఉంటాయి. అవి పేగుల్ని సంరక్షించి జీర్ణాశయాన్ని బలసంపన్నం చేస్తాయి. ఆ నీటితోనే రసాలను తయారు చేస్తారు.

3. ఇప్పుడు, కాచి చల్లార్చిన పాలు ఈ ద్రప్యానికి రెట్టింపు కొలతలో తీసుకొని ముంతలోని పెరుగు నీళ్ళతో కలపండి. చల్లకవ్వంతో ఈ మిశ్రమాన్ని చక్కగా చిలికి, అందులో "ఏలకుల" పొడి, "లవంగాల" పొడి, కొద్దిగా "పచ్చకర్పూరం", "మిరియాల" పొడి కలపండి. ఈ కమ్మని పానీయమే రసాల! దీన్ని అప్పటికప్పుడు తాగేలాగా తయారు చేసుకోవాలి.

4. ఈ వడగట్టే ప్రక్రియకు బదులుగా, పెరుగు లేదా మజ్జిగ మీద తేరుకొన్న తేటని తీసుకొని, సమానంగా పాలు కలిపి చిలికి తయారు చేసుకొవచ్చు కూడా! "శొంఠి", "మిరియాలు", "ధనియాలు", "జీలకర్ర", "లవంగాలు", చాలా స్వల్పంగా "పచ్చకర్పూరం" వీటన్నింటిని మెత్తగా దంచిన పొడిని కొద్దిగా ఈ ''రసాల''లో కలుపుకొని త్రాగితే ఎక్కువ ప్రయోజనాత్మకంగా ఉంటుంది.

5. మజ్జిగ మీద తేటలో కేవలం ఉపయోగకారక సూక్ష్మ జీవులు లాక్టోబాసిల్లై మాత్రమే ఉంటాయి. ఈ సూక్ష్మజీవుల కారణంగానే పాలకన్నా పెరుగు, పెరుగు కన్నా చిలికిన మజ్జిగ ఎక్కువ ఆరోగ్యదాయకమైనవిగా ఉంటాయి. మజ్జిగలోని లాక్టోబాసిల్లైని తెచ్చి పాలలో కలిపి, చిలికి ఈ రసాల ప్రయోగాన్ని మన పూర్వీకులు చేశారన్నమాట.

ఇది "అమీబియాసిస్" వ్యాధి, "పేగుపూత", "రక్త విరేచనాలు", "కలరా" వ్యాధులు ఉన్నవారిక్కూడా ఇవ్వదగిన పానీయం. వేసవి కాలానికి అనుకూలంగా ఉంటుంది. వడ దెబ్బ తగలనీయదు. శరీరంలో వేడిని తగ్గిస్తుంది. తక్షణం శక్తినిస్తుంది. "కామెర్ల" వ్యాధిలో ఎక్కువ మేలు చేస్తుంది. పెరుగు మీద తేట, వైద్యపరంగా, చెవులను బలసంపన్నం చేస్తుందని "ఆయుర్వేద శాస్త్రం" చెప్తోంది. "చెవిలో హోరు (టినిటస్)", చెవులలో తేడాల వలన కలిగే తలతిరుగుడు "(వెర్టిగో)" లాంటి వ్యాధులకు ఇది గొప్ప ఔషధంగా పని చేస్తుందన్నమాట.

**వేసవి కోసం "తేమనం" అనే పానీయం**

తేమనం అనేది శ్రీనాథుడి కాలం వరకూ ప్రసిద్ధి చెందిన వంటకమే! దీన్ని "తీపి"గానూ, "కారం"గానూ రెండు రకాలుగా తయారు చేసుకొంటారు. "మజ్జిగ"లో "పాలు", "బెల్లం" తగినంత చేర్చి, ఒక పొంగు వచ్చే వరకూ కాస్తే "తేమనం" అనే తెలుగు పానీయం తయారౌతుంది. ఇది వేసవి పానీయాలలో మేలయిన పానీయం. వడదెబ్బ వలన కలిగే శోషని నివారిస్తుంది. శరీరానికి తక్షణ శక్తినిస్తుంది. చల్లారిన తరువాత త్రాగటం మంచిది. దీన్ని "తీపి మజ్జిగ పులుసు" అనవచ్చు.

ఇంక "కారం" మజ్జిగ పులుసు గురించి మనకు తెలిసినదే! పులవని "చిక్కని మజ్జిగ" తీసుకోండి. వెన్న తీసిన మజ్జిగ అయితే మరింత రుచికరంగా ఉంటాయి. ఈ మజ్జిగలో "అల్లం", "మిర్చి", "కొత్తిమీర", ఇతర సంబారాలు (ఆహార పదార్థములలో అవసరమును బట్టి రుచిని, పరిమళమును, ఆహారయోగ్యతను ఎక్కువ చేయుటకు చేర్చబడుచుండు వస్తువులు (స్పయిసెస్ అండ్ కండిమెంట్స్) వేసి కాచిన మజ్జిగ పులుసు బాగా చలవ చేస్తుంది. మజ్జిగ పులుసు వేసవి కోసం తరచూ వండుకోవాల్సిన వంటకం అని గుర్తించండి!

ఉత్తర రామ చరితంలో 'గారెలు, బూరెలు, చారులు, మోరెలు' అనే ప్రయోగాన్ని బట్టి, ఈ మజ్జిగపులుసుని 'మోరు' అని పిలిచేవారని తెలుస్తోంది. 'బియ్యప్పిండి', 'అల్లం' తదితర

సంబారాలు చేర్చి ఉండలు కట్టి మజ్జిగ పులుసులో వేసి వండుతారు. ఈ ఉండల్ని 'మోరుండలు' అంటారు. వీటిని ఆవడ (పెరుగువడ) లాగా తినవచ్చు. పర్షియన్లు ఇష్టంగా వండుకొనే కాసిక్ అనే మజ్జిగ పులుసులో వెల్లుల్లి మసాలా బాగా కలిపి, రొట్టెల్లో నంజుకొంటారు కూడా!

**మెంతి మజ్జిగ**

మెంతులు తేలికగా నూరి చిక్కని పులవని మజ్జిగలో కలిపి, తాలింపు పెడితే, దాన్ని "మెంతి మజ్జిగ" అంటారు. "మజ్జిగ చారు" అని కూడ పిలుస్తారు. తెలుగిళ్ళలో ఇది ప్రసిద్ధ వంటకం. దీన్ని అన్నంలో ఆధరవుగానూ తినవచ్చు లేదా విడిగా తాగవచ్చు కూడా! మామూలు మజ్జిగకన్నా అనునిత్యం మజ్జిగ చారునే వాడుకోవటం ఎప్పటికీ మంచిది. ముఖ్యంగా షుగర్ వ్యాధి ఉన్నవారికీ, వచ్చే అవకాశం ఉన్నవారికీ ఇది మంచి చేస్తుంది.

**తీపి లస్సీ**

మజ్జిగలో "పంచదార" లేదా "తేనె" కలిపిన పానీయమే లస్సీ! హిందీ లేదా పంజాబి పదం కావచ్చు. వేసవికాలంలో "నిమ్మరసం", "జీలకర్ర" పొడి, "ఉప్పు", "పంచదార" కలిపి "పుదీనా ఆకులు" వేసిన లస్సీ వడ దెబ్బ తగలకుండా కాపాడుతుంది. తెలుగులో దీన్ని 'సిగరి' అంటారు. శిఖరిణి అనే సంస్కృత పదానికి ఇది తెలుగు రూపం కావచ్చు. చిక్కని మజ్జిగ అయితే "లస్సీ" అనీ, వెన్న తీసేసి, నీళ్ళు ఎక్కువ కలిపితే ""చాస్"" అనీ పిలుస్తారు. టర్కీలో అయరాన్, ఆర్మీనియాలో థాన్, పర్షియాలో ధూగ్, ఆల్బేనియాలో థాలే అనే పానీయాలు ఇలాంటివే! గుర్రం పాలతో కుమిస్ అనే పానీయాన్ని మధ్య ఆసియా స్టెప్పీలు ఇష్టంగా తాగుతారట! పర్షియన్ కాసిక్ అనేది మన మజ్జిగ పులుసు లాంటిదే!

**మజ్జిగ మీద తేట**

మజ్జిగమీద తేటకు మజ్జిగతో సమానమైన గుణా లున్నాయి. చిలికిన మజ్జిగని ఒక గిన్నెలో సగానికి పోసి మూడొంతుల వరకూ నీళ్ళు కలిపి రెండు గంటలు కదల్చ కుండా ఉంచండి. మజ్జిగమీద ఆ నీరు తేరుకొంటుంది. మజ్జిగ తేటను వంచుకొని మళ్ళీ నీళ్ళు పోయండి. ఇలా ప్రతి రెండు మూడు గంటలకొకసారి మజ్జిగనీళ్ళు వంచుకొని వేసవి కాలం అంతా మంచి నీళ్ళకు బదులుగా ఈ మజ్జిగ నీళ్ళు తాగుతూ ఉండండి వడదెబ్బ కొట్టదుగాక కొట్టదు.

**ఎండలోకి వెళ్ళబోయే ముందు దీన్ని తాగండి:**

చక్కగా "చిలికిన మజ్జిగ" ఒక గ్లాసునిండా తీసుకోండి. అందులో ఒక 'నిమ్మకాయ రసం', తగినంత 'ఉప్పు', 'పంచదార', చిటికెడంత "తినేసోడా ఉప్పు" కలిపి తాగి అప్పుడు ఇంట్లోంచి బయటకు వెళ్ళండి. వడదెబ్బ కొట్టకుండా ఉంటుంది. మరీ ఎక్కువ ఎండ తగిలిందనుకొంటే తిరిగి వచ్చిన తరువాత ఇంకోసారి త్రాగండి. ఎండలో ప్రయాణాలు చేయవలసి వస్తే, ఒక సీసానిండా దీన్ని తయారు చేసుకొని వెంట తీసుకెళ్ళండి. మాటిమాటికీ తాగుతూ ఉంటే వడదెబ్బ కొట్టదు. ■

## నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై అవగాహన

నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రతలపై మడకశిర పట్టణంలోని భోగేశ్వర ఆలయంలో మెప్మా సంఘాల లీడర్లు ఇటీవల ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎపియుడబ్ల్యూ ఎస్ఎస్ఎం ఐపి సహకారంతో యునిసెఫ్, ఎపిఎంఎఎల్ ఆధ్వర్యంలో విచ్చేసిన రాష్ట్ర వాష్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రతలపై కరోనా పెరుగుతున్న ఈ సమయంలో ప్రజల్లో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రతలపై అవగాహన కల్పించి వాష్ అలవాట్ల గూర్చి ఒక అజెండా పాయింట్‌లాగా పెట్టుకొని వాష్ అలవాట్లను పాటించేలా ప్రోత్సహించాలన్నారు. వాష్ కో ఆర్డినేటర్ వర్ధన్ మాట్లాడుతూ, శుభ్రమైన నీరు, సక్రమమైన మరుగుదొడ్ల వాడకం , హ్యాండ్ వాష్ అలవాట్ల వల్ల అనారోగ్యాలు దరికి రావన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో టిఎంసి రమాదేవి, ఎపియుడబ్ల్యూ ఎస్ఎస్ఎంఐపి, ఏపిమాస్ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ షణ్ముఖ, శానిటేషన్ సెక్రటరీ అక్కులప్ప, సిఓ సదానంద, సచివాలయం శానిటరీ సెక్రటరీలు, మెప్మా సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ■

# చేపల పెంపకంలో నూతన ప్రక్రియలు !

**ఆ**క్వాకల్చర్ లేదా చేపల పెంపకం లాభదాయకమైన జీవ సంతతి వ్యవస్థల్లో ప్రత్యేకత సంపాదించుకుంది. చేపల ఉత్పత్తి పెరుగుదల పలితంగా ప్రకృతి ప్రసాదించిన వనరుల సంరక్షణతో పాటు ప్రయోజనకరంగా ఉండాలంటే ఉత్తమ పశుపోషణ విధానాలను అనుసరించినప్పుడే సాధ్యమవుతుంది.

చేపల పెంపకం ఇతర ఉత్పత్తి విధానాలకు భిన్నమైనది. వీటి ఉత్పాదనకు వినియోగించే జల వనరుల స్థాయిని బట్టి (అంటే చెరువులు, ట్యాంకులు, కృత్రిమ నీటి ప్రవాహాలు, పంజరాలు లేదా వలల లాంటివి అమర్చడం ద్వారా), నిర్వహణ తీరును బట్టి (అంటే విస్తృత స్థాయి, పాక్షికంగా తీవ్రస్థాయి, పాక్షికంగా తీవ్ర స్థాయి, తీవ్రస్థాయి తీవ్రస్థాయి లేదా సూపర్ తీవ్రస్థాయి వంటివి), ఉత్పాదన విధానం బట్టి (అంటే ఏకరూపక జీవుల లేదా బహుళ రూపక జీవాల పెంపకం), నీటిలో క్షారగుణ స్థాయిని బట్టి (అంటే కొత్త నీరు, వెనక్కి మళ్ళిన సముద్ర జలాలు లేదా బ్రాకిష్ వాటర్, సముద్రపు జలాలు), వాతా వరణం ప్రాతిపదికగా (చల్లని నీటి చేపల పెంపకం లేదా వేడి నీటిలో పెంపకం), నీటి ప్రవాహపు తీరు (అంటే స్థిరంగా నిలిచిన నీరు లేదా ప్రవాహ అవకాశాలున్న వ్యవస్థలు) ఆధారంగా చేపల పెంపకం వివిధ రకాలుగా వర్గీకరిస్తారు. మట్టితో నిర్మించిన చెరువులు, కృత్రిమ నీటి ప్రవాహాలు, సమీకృత పెంపకం, వలలు ఆధారంగా చేపల పెంపకం ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా కనిపిస్తుంది.



మన దేశంలో తాజా నీటిని ఆధారం చేసుకుని చేపల పెంపకం చేపట్టడం ఎక్కువగా కనిపిస్తుంది. పేద ప్రజలకు పోషక విలువలు అందించే ప్రకృతి ప్రసాదిత ఆహారంగా ఉపయోగపడడంతో పాటు వారికి అదనపు ఆదాయం సమకూర్చి పెట్టే మరో జీవనోపాధిగా కూడా చేపల పెంపకం గుర్తింపు పొందింది. తక్కువ ఖర్చుతో పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడానికి అనువైన జీవనోపాధి ఇది. అందువల్ల పేద కుటుంబాలకు మంచి లాభాలు మెరుగైన ఆదాయం వస్తుంది. ఆర్థికంగా ప్రయోజనకరమే కాకుండా ఇది పర్యావరణ సంరక్షణలో కూడా తోడ్పడుతుంది. మన దేశంలో చేపల ఉత్పత్తి ప్రపంచ దేశాల్లోనే రెండవ స్థానంలో ఉంది. ఈ స్థాయికి చేరడంలో చిన్న, సన్నకారు చేపల పెంపకందారుల కృషి చాలా ప్రధానమైనది

చేపల పెంపకం విజయ వంతంగా సాగాలంటే ప్రధానంగా మూడు అంశాలు చాలా ముఖ్యం. అవి... 1. చెరువుల నిర్వహణలో సరైన విధానాలు పాటించడం 2. సరైన కొలతలతో సరైన సంఖ్యలో వైవిధ్యంతో కూడిన చేపల రకాలను ఎంపిక చేసుకోవడం 3. సొంత వ్యవసాయ క్షేత్రాలలోనే స్థానికంగా లభించే వ్యవ సాయ సంబంధిత పోషకాలు ఉన్న చేపల ఆహారం తయారుచేసుకుని ఒక పద్ధతి ప్రకారం వాటిని అందించడం.

చేపల పెంపకంలో అవసరమైన ఇన్‌పుట్‌లను గరిష్ట స్థాయిలో సరైన విధంగా ఉపయోగించుకున్నప్పుడే సుస్థిరమైన అధిక దిగుబడులు సాధ్యమవుతాయి. ఇందుకు కొన్ని సాధారణమైన తేలికపాటి శాస్త్రీయ పద్ధతులు అనుసరించాలి. అలాగే అవసరమైన అన్ని సమయాల్లోనూ నిర్వహణపరంగా ఉత్తమ పద్ధతులు చేపట్టాలి. ఇదివరకటి రోజుల్లో సరైన

నీవు ఎంచుకున్న మార్గాలు ... ఆ దారులవెంట నీ నడక తీరు ... జీవితం అంటే ఇదే !

సమాచారం ఎప్పటికప్పుడు అందించే అవకాశాలు ఉండేవి కావు. ముఖ్యంగా పునరుత్పత్తిని నియంత్రించడంలో కానీ, వాటిని పెంచి పోషించడంలో కానీ రైతులకు సరైన అవగాహన ఉండేది కాదు. ఆ కారణంగా రైతులు లార్వా సేకరణ, అందుబాటులో ఉన్న నదుల్లో నుంచి చేప పిల్లలను సేకరించి చెరువుల్లో పెంచేవారు. వాటికి ఆహారం అందించేందుకు బంద్ బ్రీడింగ్ పద్ధతి అనుసరించేవారు. ఈ పద్ధతిలో గట్టిగా వర్షం వచ్చినప్పుడు ఆహారం మొత్తం నీటి ప్రవాహంలో కొట్టుకుపోయేది. వర్షపు నీరు చేపల చెరువుల్లోకి పొంగిపొర్లేది. ఒకరకంగా ఇప్పటికే ఇదే పద్ధతి సాగుతోంది. ఆ తరువాతి కాలంలో ఒక క్రమ పద్ధతిలో చేపలకు ఆహారం చేర్చే విధానం అమలులోకి వచ్చింది. ఈ పద్ధతిలో ఒక స్థిరమైన క్రమంలో చేపలకు ఆహారం సమకూరుస్తారు.

చేపల పెంపకంలో సామూహికంగా ఆహారం అందించే విధానంలో జన్యుపరమైన ఎంపిక ప్రక్రియ అనుసరించి వేగవంతమైన ఎదుగుదలకు దోహదపడే పద్ధతి రూపుదిద్దుకుంది. ఈ క్రమంలోనే ఏడాది పొడవునా నిల్వ



చేసుకుని ఉంచుకునే అవకాశం ఉన్న చేపల సీడ్ అందుబాటులోకి వచ్చింది.

**రైతుల ఆవిష్కరణలు**

తేలికపాటి పరికరాలను ఉపయోగిస్తూ నిత్యం సరికొత్త విధానాలను గుర్తించి సమస్యలను పరిష్కరించడంలో అనుసరిస్తున్న రైతుల తెలివితేటల కారణంగా చేపల పెంపకం మంచి ఫలితాలను ఇస్తున్నది. అందేకాకుండా కాలం విసిరే అనేక సవాళ్ళను తట్టుకుని ముందుకు సాగుతూ రైతులకు సులభదాయకంగా మారుతోంది. పశ్చిమ బెంగాల్‌లోని బంకురా, ఉత్తర 24 పరగణాలు, హుగ్లీ, దక్షిణ దినాజ్‌పూర్, తూర్పు బుర్ద్వాన్, మాల్డా, తూర్పు మిద్నపూర్ జిల్లాల్లో సంప్రదాయక విధానంతో పాటు తేలికపాటి అయినా అనుకూలమైన పరికరాల సాయంతో ఉత్తమ దిగుబడులు సాధించగలుగుతున్నారు.

- చేపల పెంపకాన్ని చేపట్టిన చెరువుల్లోని నీటిలో ఆక్సిజన్ (డిసాల్వ్‌డ్ ఆక్సిజన్) కరిగిపోయి సమస్యగా మారుతుంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి. నీటిలో ఇలా కరిగిపోయిన ఆక్సిజన్ స్థాయి లీటర్‌కు 3.0 మిల్లీగ్రాములకు చేరినట్లయితే అలాంటి నీటిలో చేపలు బతకడం కష్టమవుతుంది. పెద్ద చేపలు, ముఖ్యంగా గండు చేపలు నీటి పైభాగానికి చేరి శ్వాస తీసుకునేందుకు చాలా ఇబ్బంది పడతాయి. ఇలాంటి పరిస్థితి సాధారణంగా తెల్లవారుజాము వేళలో ఎదురవుతుంది. సూర్యరశ్మి తగినంత లేకపోయినా, ఆకాశం మేఘాలతో దట్టంగా వ్యాపించి ఉన్నా ఈ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. చేపల మనుగడ కష్టంగా మారి రైతుకు

### చేపపిల్లల రక్షణకు ఉత్తమ విధానాలు

- వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల నుంచి చేప పిల్లలను కాపాడేందుకు వాటి ఆకులతో చల్లటి నీడనిచ్చే ఏర్పాటు చేయడం
- నీటి నాణ్యత నిర్ధారణకు ముఖ్యంగా మలినాల తీరును అంచనా వేసేందుకు తయారుచేసిన సేచి డిస్క్‌ను వినియోగించడం
- 15 రోజులకు ఒకసారి ఔషధపూరిత ఆహారం – వేప ఆకులు, పసుపు, తులసి ఆకులు, వెల్లుల్లి, కొద్దిపాటి సాధారణ ఉప్పు జత చేసిన మిశ్రమం – అందించడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ ఇవ్వడం
- చెరువుల అడుగుల్లో పేరుకొనిపోయిన గ్యాస్ తొలగించేందుకు రేకర్స్ ఉపయోగించడంతో పాటు నీటి నాణ్యతను కాపాడేందుకు వీలుగా సున్నపు నీటిని సిఫార్సు చేసిన మేరకు చేర్చడం.

శత్రువులు వున్నారంటే నీవు గట్టివాడివే ; జీవితంలో ఒక్కసారైనా నమ్మినదానికోసం నిలబడ్డావన్నమాట

తీవ్ర నష్టాలను కలిగించవచ్చు. అత్యవసర ప్రాతి పదికపై వాటిని ఆక్సిజన్ అందించాల్సి ఉంటుంది. సాధారణంగా చేపల రైతులకు ఎలాంటి బీమా సదుపాయం ఉండదు. పైగా వారు భారీ మొత్తం ఖర్చు పెట్టి ఖరీదైన యాంత్రిక ఆక్సిజన్ అందించే యంత్రాలను (మెకానికల్ ఏరేటర్స్) కొనుగోలు చేయలేరు. అందువల్ల పేద రైతులు ఒక సాధనాన్ని ఉపయోగిస్తారు. వాటిని వెదురు బొంగుల తయారు చేసిన బుట్టలను మూడు వెదురు బొంగులకు అమర్చి వాటికి 0.5 హెచ్‌పి పంపుల సాయంతో నీటిని సరఫరా చేస్తారు. ఈ బుట్టలు నీటి అడుగున ఉండే అందులోకి వేగంగా వచ్చిపడే గొట్టాల నీటి ద్వారా ఆక్సిజన్ సరఫరా పరిస్థితిని మెరుగుపరచేందుకు ప్రయత్నిస్తారు. ఇది తక్కువ ఖర్చుతో కూడినది. స్వల్పకాలానికి మాత్రమే అనువైనది. చేప పిల్లలకు కూడా సురక్షితమైనది.

- పెద్దగా వనరులు లేని పశ్చిమ బెంగాల్ గ్రామ ప్రాంతాల పేద రైతులు మలి దశలో ఉన్న చేపపిల్లలను (అడ్వాన్స్‌డ్ ఫింగర్ లింగ్స్) పెంచుతుంటారు. ఇవి ఎదగడానికి మూడు నెలల వ్యవధి అవసరం. పూర్తిగా పెరిగిన చేపలను తొలగించిన మరుసటి రోజే కొత్తగా మళ్ళీ ఇలా చేపపిల్లలను చెరువుల్లోకి జారవిడుస్తుం టారు. ఆ రకంగా ఏడాది కాలంలో మూడుసార్లు దిగుబడి సాధించేందుకు ప్రయత్నిస్తుంటారు. గిరాకీ అధికంగా ఉంటున్న కారణంగా వారికి ఇది గిట్టబాటు గానే కనిపిస్తుంది. అయితే చేపలను వేటాడే కింగ్ ఫిషర్, గూడ కొంగలు (కార్మోరాంట్స్), సాధారణ కొంగలు (హెరాన్స్) ప్రమాదకరంగా తయారవు తుంటాయి. వీటి కారణంగా చేపల ఎదుగుదల సవ్యంగా సాగదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రైతులు చేపల చెరువులపై తాళ్ళను అమర్చి కాపాడు కుంటారు. ఇది ఎక్కువ ప్రయోజనం కలిగిస్తోంది. పైగా ఈ ఏర్పాటు వల్ల పక్షిజాతికి ఎలాంటి హాని జరగదు కాబట్టి పర్యావరణ శాస్త్రవేత్తల మద్దతు కూడా లభిస్తున్నది.



- గండు చేపలు లేదా మన దేశ మత్స్య సంపదలో ప్రధానమైన ఈ తరహా ఇతర రకాల చేపల (కాట్లా, రోహు, మృగాల్) పెంపకం అధికంగా సాగుతుంది. వీటిని తాజా నీటిలో పెంచడం సర్వ సాధారణం. ఇక దేశీయ మైన చిన్న తరహా చేపల రకాలు గాలిని పీల్చుకునే క్యాట్‌ఫిష్, మగూర్, సింఘి, చన్నా స్పా తరహా చేపలు, సెర్చి రూపంలోని కోయి, సున్నితమైన పై చర్మం ఉండే చేపలు ఫోలూయి ఈల్స్ పాకల్, మరింత చిన్నవిగా ఉండే మొలా, తంగారా, పబ్డా, కోయిరా, వాచా రకాలకు చాలా హెచ్చు మోతాదులో డిమాండ్ ఉంటుంది. అందువల్లనే రైతులు చేపల పెంపకంలో కూడా వైవిధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. చేపల చెరువుల్లో వెదురు గూళ్ళను ఏర్పాటు చేయడం ద్వారా వివిధ రకాల చేపలను ఏకకాలంలో సాగు చేస్తుంటారు. ఈ పద్ధతిలో వాటికి ఆహారం అందించడం లేదా సేకరించడంలో ఎలాంటి సమస్యలు ఎదురుకావు.
- చేపల పెంపకంలో చేపలకు సరైన ఆహారం అందించడమే అన్నిటికన్నా ఖరీదైన వ్యవహారం. అందువల్ల వనరుల లోపం ఉన్న పేద రైతులు తప్పనిసరిగా మార్కెట్‌లో లభించే వాటితోనే గడిపేస్తారు. ఈ సందర్భంలో చేపలకు సహజసిద్ధంగా ఆహారంగా తీసుకునే జూప్లాంక్టన్, పెరిఫైతాన్ వంటి వాటి పెంపకం కూడా చేపడుతారు. సేంద్రీయ ఎరువుల తయారీ, కొన్ని సందర్భాలలో వెదురు బొంగుల్లో వాటిని పూర్తిగా నింపి చెరకు పిప్పితో మూతపెట్టి చేపల చెరువుల్లో అక్కడక్కడ చేపలకు అందేవిధంగా ఏర్పాటు చేస్తారు. ఈ పద్ధతిలో రోహు చేపలకు అందే విధంగా



ఏర్పాటు చేస్తారు. ఈ పద్ధతిలో రోహు చేపలకు ఇష్టమైన పెరిఫైతాన్‌ను ఆహారంగా అందిస్తారు. ప్రస్తుతం ఈ తరహా చేపల పెంపకంపై రైతులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.

- పశ్చిమ బెంగాల్‌లోని గ్రామ ప్రాంతాల చిన్నతరహా చేపల పెంపకందారులు చిన్న చిన్న చెరువుల్లోను, మధ్యశ్రేణి సరస్సుల్లోను తేలికపాటి ఆహారం అందించే పరికరాలు ఉపయోగిస్తున్నారు. వాటిలో నైలాన్ బ్యాగుల్లో ఆహారం చేర్చి వాటిని వెదురు బొంగుల సాయంతో నీటిలో తేలియాడుతూ వేలాడదీస్తారు. ఓ మోస్తరు కార్స్ చేపల పెంపకంలో ఈ పద్ధతినే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.
- స్థానికంగా లభించే వ్యవసాయ వ్యర్థాల సహాయంతోనే చౌమీన్ / స్పగెట్టి వంటి చేపల ఆహారం తయారు చేసుకుంటారు. అందుకు ఆయా ప్రాంతాల్లో లభించే పరికరాలనే వినియోగిస్తారు. బాగా ఎండబెట్టి గన్నీ బ్యాగుల్లో నిలవ చేసుకుంటారు. గిరిజన యువకులు, చిన్న తరహా రైతులు ఈ తయారీలో నేర్పు సంపాదించుకున్నారు. ఇలా వారు తయారుచేసిన చేపల ఆహారాన్ని తమ సొంత అవసరాలకే కాకుండా ఇతరులకు కూడా సరఫరా చేస్తుంటారు.
- చేపల చెరువుల్లో పేరుకున్న హానికరమైన సూక్ష్మ జీవులను నాశనం చేసేందుకు వారు ఎలాంటి క్రిమిసంహారకాలను ఉపయోగించరు. వాటిని చేతులతోనే ఏరిపారవేస్తుంటారు.
- ఇటీవలి కాలంలో చేపలకు రుచికరమైన ఇపోమియా వంటి మొక్కల పెంపకాన్ని కూడా ఎంతో ఉత్సాహంతో చేపడుతున్నారు. ఏజోలా, డక్‌వీడ్ వంటివి కూడా చేపలకు ఆహారంగా ఉపయోగించవచ్చు. ఇవి జీవసంబంధిత ఎరువుగా కూడా ఉపయోగపడతాయి. ఈ పద్ధతుల ద్వారా మానవులకు ఆహారంగా ఉపయోగపడే చేపల పెంపకంలో జీవ సంబంధ ఎరువుగా కూడా ఉపయోగపడతాయి. ఈ పద్ధతుల ద్వారా మానవులకు ఆహారంగా ఉపయోగపడే చేపల పెంపకంలో జీవ సంబంధ పోషకాలు సమృద్ధిగా ఉండేట్లు చూసుకుంటున్నారు. అది కూడా అతి కొద్ది మాత్రపు పెట్టుబడులతోనే సాకారం చేసుకుంటున్నారు. ఈ విషయంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోంది.

చేపల పెంపకంలో శాస్త్రీయ సూత్రాలను అనుసరించవలసిన అవసరమైతే ఉంది. అదే సమయంలో రైతులు స్వతంత్ర ఆలోచనలతో రూపొందిస్తున్న ఆవిష్కరణలు లేదా సరికొత్త ఆలోచనలు కాలపరీక్షను ఎదుర్కోగలుగుతున్నాయి. వీటికి తగిన గుర్తింపు ఇవ్వడం కూడా అవసరం.

**(లీసా ఇండియా సౌజన్యంతో ...)**

■

యుద్ధాన్ని మనం ముగించకపోతే యుద్ధం మనలను ముగిస్తుంది

# జీవ వైవిధ్య పరిరక్షణ సమాజ బాధ్యత !

పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత. మానవ తప్పిదాల వలన పర్యావరణానికి జరుగుతున్న ప్రమాదాన్ని ప్రతి ఒక్కరూ అర్ధం చేసుకోవాలి. అనూహ్యమైన ప్రపంచ జనాభా పెరుగుదల ఆహారము, మంచినీరు, స్వచ్ఛమైన గాలి, భూమి అవసరములను ద్విగుణీకృతము చేయుచున్నది. విచక్షణా రహితంగా అడవులను నరికివేయడం వల్ల జీవ వైవిధ్యతకు పూరించలేని నష్టం కలుగుతున్నది. అతి పేద మరియు అత్యున్నత జనాభా గల దేశాలు వాటి బ్రతుకు అవసరాల కొరకు ఉన్న వనరులన్నీ వినియోగించు కుంటున్నాయి. ఏనాటికి తీర్చలేని అవసరాలతో కొట్టు మిట్టాడుతున్న మానవ సమాజం, అందుబాటులో ఉన్న సహజ ప్రకృతి వనరులను నేలమట్టం చేస్తూ తనకు తానుగా మృత్యుకుహరానికి రోజు రోజుకూ దగ్గరవుతున్నది.

రోజురోజుకు పెరుగుతున్న అవగాహనతో ప్రజలు పర్యావరణ పరంగా సున్నితమైన ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు చేపడుతున్నారు.

సహజ వనరులను రక్షించుకొనుటకు భారతదేశంలో అనేక రక్షణ సంస్థలు పని చేయుచున్నవి.

ఎన్ని ఒడుదుడుకులను ఎదుర్కొంటున్నా జీవజాతి వైవిధ్యం ప్రత్యేక జీవుల్లోని వైవిధ్యము నిలిచియున్నది. రైతులు, అటవీ ప్రాంతవాసులు ఈ వైవిధ్యాన్ని తరతరాలుగా రక్షిస్తున్నారు. వారి సాంస్కృతిక ఆచారములు విజ్ఞాన విధానాలు ఈ వైవిధ్యతను కాపాడుతున్నాయి.

ప్రకృతి సృష్టించిన జీవరాసులన్నీ రక్షించబడాలంటే ప్రకృతి ఆరాధన అవసరమని అటవీ జాతులవారి నమ్మకము. అట్టి నమ్మకమే చాలా దట్టమైన అరణ్యములను వాటి సహజ స్థానంలో ఉండేటట్లు చేస్తున్నది. అట్టి అడవులను పవిత్ర అడవులు (దేవుని లేక అమ్మ) అరణ్యాలని పిలుస్తారు (సేక్రెడ్ గ్రూప్స్). ఈ దట్టమైన అడవులను స్థానిక ప్రజలు తాకరు. వాటిలో ప్రవేశము నిషేధించడమైనది. ఈ ఆచారము క్రీ.పూ. 3000 నుంచి 5000 సంవత్సరాలనాటిది. భారత జాతి విభిన్న సంస్కృతులతో ప్రత్యేకమైన సాంప్రదాయ అలవాట్లను కలిగి యుండి, ప్రకృతిని ప్రకృతి ప్రసాదించిన సృష్టిని కాపాడుకుంటున్నది.

**జీవ వైవిధ్య రక్షణ – జీవ రక్షణే**

- అడవుల నరికివేత, పర్యావరణపరంగా అతి సున్నితమైన ప్రాంతాలలో వన్యజీవులవేటలకు వ్యతిరేకంగా ర్యాలీలు తదితర అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి.
- సామాజిక అడవుల పెంపకము, ప్రతి ఇంటికి ఒక చెట్టు పథకము, అడవుల పోషణ కార్యక్రమములను కార్యాచరణ ప్రణాళికలుగా రూపొందించాలి. టెలివిజన్, రేడియో, వార్తాపత్రికల ద్వారా అవగాహనను పెంచాలి.
- పర్యావరణ శిక్షణలు, ఫోక్ ఆర్ట్సు, నాటకాల ద్వారా అవగాహన పెంచాలి.
- పర్యావరణ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలి.
- భూగోళ రక్షణకు, జీవ వైవిధ్యాన్ని కాపాడుకొనుటకు ప్రతి వ్యక్తి తనకు తోచినంత తోడ్పాటును అందించాలి.
- ప్రస్తుతానికి మిగిలివున్న వన్యప్రాణుల రక్షణకు వాటిని, వన్యప్రాణుల అవయవాలు, వ్యాపారులు వేటగాళ్ళ బారి నుండి రక్షించటానికి, మనము జంతువుల దేహభాగము లను అనగా ఉన్ని, దంతాలు, ఎముకలు, గోళ్ళు మొదలైనవాటితో చేయబడిన అలంకార వస్తువులపై మక్కువను చంపుకోవాలి.
- శాకాహార అలవాట్లను పెంచుకొని, సాధ్యమైనంత తక్కువగా జంతువులను చంపుటకు తోడ్పడి ఆహార అవసరాల కొరకు ఎక్కువ మొక్కలను పెంచే పద్ధతులను అలవరచుకోవాలి. అవకాశమున్న ప్రతి చోటా మొక్కలను పెంచుటద్వారా జీవవైవిధ్యానికి తోడ్పడటమే గాక, వాతావరణ కాలుష్యనివారణకు, భూమి బలము పెంచుటకు ఇంకా అనేక విధములైన లాభములను పొందగలము. రసాయనిక ఎరువులను, రసాయనిక

పురుగుమందులను వాడకుండా వాటి బదులు సేంద్రియ ఎరువులను, చెట్ల, రసాయనములతో కూడిన పురుగు మందులను వాడుటను ప్రోత్సహించాలి. ప్లాస్టిక్, పోలియెస్టర్ కవర్లకు బదులు పేపరు గుడ్డ సంచుల వాడకాన్ని ప్రోత్సహించాలి. ప్లాస్టిక్ కుళ్ళని పదార్థము. దాని వాడుక వలన పర్యావరణం దెబ్బ తింటున్నది.

- ప్రయత్నపూర్వకంగా ఒక పరిశ్రమ విడుదల చేస్తున్న వ్యర్థాల్ని వేరే పరిశ్రమలకు ముడి పదార్థంగా ఉపయోగించాలి.
- వ్యర్థాల్ని తగ్గించు పద్ధతులకు అలవాటు పడుతూ మన అవసరాల్ని నియంత్రించుకోవాలి.
- పిల్లలకు వారి పరిసరాల స్థితిగతులను తెలియబరుస్తూ జీవ వైవిధ్యానికి తోడ్పడే పద్ధతులను నేర్పాలి.
- పర్యావరణ పరిస్థితులను మెరుగపరిచే సేంద్రీయ వ్యవసాయ విధానాలను ప్రోత్సహించాలి.
- పొగ రాకుండా వాడే చులాలు, భూగర్భ జలాల్ని పెంచే విధానాలు వాయు సహాయంతో విద్యుత్తును ఉత్పత్తి చేయుట, సూర్యరశ్మిని నిత్యావసరాలకు ఉపయోగించు సుస్థిర సాంకేతిక విధానాలను అనుసరించాలి.
- ప్రకృతి సహజంగా ఆవిర్భవించిన జీవరాసులలో మానవులూ ఒక భాగమే. భూభాగంపై నివసించే ఇతర జీవరాసులను చంపే హక్కు మానవజాతికి లేదు. అన్ని జీవరాసులనూ, వృక్షజాతులనూ ప్రేమతో చూడాలి.

**మనము నిర్వర్తించవలసిన కార్యాచరణ పథకములు**


జాతీయ పర్యావరణ జాగృతి కార్యక్రమములో భాగంగా జీవ వైవిధ్య పరిరక్షణ అనే అంశానికి సంబంధించి చేపట్టవలసిన కొన్ని కార్యక్రమములను, వివిధ కార్యాచరణ పథకములను క్రింద పేర్కొనడం జరిగింది.

1. విత్తన బ్యాంకులను, విత్తన సేకరణను ప్రోత్సహించాలి.
2. జీవ వైవిధ్య ప్రోత్సాహాన్ని, ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు, రసాయనిక పురుగు మందులకు, ఎరువులకు బదులుగా సేంద్రీయ ఎరువులను, పురుగు మందులను ఉపయోగించాలి.
3. జీవ వైవిధ్య రిజిష్టర్లను ప్రత్యేక సంఘాల ద్వారాను, స్కూళ్ళలోను, గ్రామాల్లోను తయారు చేయించాలి.
4. స్థానికంగా పెరిగే ఔషధ మొక్కలను పెంచుటకు ప్రోత్సహించాలి.
5. నీటి వనరులను, తరిభూములను కాలుష్యపరిచే విధానాలను నిరోధించాలి.
6. సుస్థిర సాంకేతిక పద్ధతులను నెలకొల్పాలి.
7. స్వతంత్రంగా సంచరించే జంతువులు, వలస పక్షులు, అంతరిస్తున్న ప్రత్యేక జీవజాతుల రక్షణ కొరకు పరగణాలు ఏర్పాటు చేయాలి.
8. వృక్ష జాతుల, జంతువుల రక్షణ కొరకు స్వచ్ఛంద గ్రామ ఆవరణాలు ఏర్పాటు చేయాలి.
9. తరిగి పోతున్న జీవజాతుల వివరములను జాతీయ రక్షణ సమాఖ్యలకు తెలియచేసి సహాయం చేయాలి.
10. స్థానిక విత్తనములను ప్రోత్సహించాలి.
11. గ్రామాలలో సాంప్రదాయక ఔషధ పద్ధతులను ప్రోత్సహించాలి.

**అవగాహన పెంపొందించు కార్యక్రమములు**

1. జీవ వైవిధ్యముపై ప్రజలలో అవగాహన పెంచుటకై సదస్సులు ఏర్పాటు చేయుట
2. పర్యావరణ పరిస్థితులకు అనువైన పంటలను ప్రోత్సహించుట
3. వన్యజీవులను చంపుట ద్వారా తయారవుతున్న ఉత్పత్తులను నిరోధించుట
4. శాఖాహార విలువలను ప్రచారము చేయుట
5. పంచాయతీల పరిధిలో వర్క్‌షాపులను, అవగాహన సదస్సులను నిర్వహించుట
6. స్కూళ్ళలోను, విద్యా సంస్థలలోను చెట్ల పెంపకమును ప్రోత్సహించుట
7. సేంద్రియ వ్యవసాయముపై రైతులకు అవగాహన సదస్సులు, సాంప్రదాయక చెట్ల మందులను, ప్రజలలోను, వైద్యులలోను ప్రచారము చేయుట
8. జీవ వైవిధ్య విజ్ఞానమునకు సంబంధించిన ఔషధ మొక్కల తరి భూముల ప్రాముఖ్యతను పుస్తకముల ద్వారా ప్రచారము చేయుట

■



नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
నీళ్ళ ట్యాంకు మరియు రెండు గుంతల మరుగుదొడ్డి
దీర్ఘ కాలం అందించెను మీకు సేవలు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23

## ఏపిమాస్ భాగస్వామ్య సంస్థలలో మహిళా దినోత్సవం ... మరికొన్ని చిత్రాలు !





శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పురస్కార గ్రహీతలతో సి ఎస్ ... ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో ... సుంకేసులలో ...





కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో ... నల్లమాడలో విజేతలకు బహుమతులు






నల్లమాడలో మహిళా దినోత్సవ సభ ... ధీశాలి ఎఫ్ పి ఓ లో ... పెద్ద వడుగూరులో ...





కురబలకోట, వాల్మీకిపురం ఎఫ్ పి ఓ లచే ... నల్లమాడలో ఆదర్శ రైతు మహిళకు సన్మానం




వి.కోటలో ... ధరణి ఎఫ్ పి ఓ లో ...





ఉట్నూరు ఐ టి డి ఏ ఎఫ్ పి ఓ లకు శిక్షణ ... కదిరిలో కిసాన్ మేళా ... నరసంపేట ఎఫ్ పి ఓ ప్రతినిధులకు శిక్షణ

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089